



అమలాపురం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 35 (శనివారం)
కనిష్ఠం : 29

జిల్లావ్యాప్తంగా పీవీ రావు జయంతి వేడుకలు 8



అన్నవరంలో పండిత సదస్యం సందర్భంగా ప్రత్యేక అలంకరణతో ఆసీనులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవారు

ఘనంగా పండిత సదస్యం

- సుమారు 192 మంది పండితులకు సత్కారం
- వేదఘోషతో పులకించిన సత్యదేవుడి సన్నిధి
- నేడు సత్యదేవుడి రథోత్సవం

7

పైరవీకారులు!



- ఉమ్మడి తూ.గో. జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ యూనిట్లకు జోరుగా పైరవీలు
- అయిదేళ్ల తర్వాత పథకం మొదలవడంతో ఎలాగైనా దక్కించుకోవాలని పాట్లు
- ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల వద్దకు వెళ్లి యూనిట్ల కోసం కొందరు తెగ ప్రయత్నాలు
- పోటీ తీవ్రంగా ఉండడంతో ఉమ్మడి జిల్లాలో 2,732 యూనిట్లకు 13,317 దరఖాస్తులు రాక
- కాకినాడ జిల్లాలో 5,498, కోనసీమ 3,265, తూర్పుగోదావరిలో 4,555 మంది పోటీ
- రూ.10 లక్షల రుణం విభాగంలో ఇచ్చే కారు, గూడ్స్‌ట్రక్, ఆటోల కోసం అప్పుడే ఖర్చీఫ్‌లు
- నలభై శాతం సబ్సిడీ, బ్యాంకు రుణం 55శాతం వస్తుండడంతో తెగ తాపత్రయం
- ఇదే అదనుగా రుణం వచ్చేలా చేస్తామంటూ కొందరు చోటా నేతలు కమీషన్ల వసూలు
- రూ.4 లక్షలు సబ్సిడీగా వస్తుండడంతో రూ.లక్ష ఇవ్వాలంటూ దళారుల బేరాలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇవ్వనున్న స్వయం ఉపాధి రుణ యూనిట్లకు అప్పుడే పైరవీలు మొదలయ్యాయి. ఎలాగైనా పథకం ద్వారా లబ్ధిపొందాలని కొందరు రాజకీయ ఒత్తిళ్లకు దిగుతున్నారు. ముఖ్యంగా ఈ పథకం కింద కార్లు, గూడ్స్ ట్రక్కులు, ఆటోలు సబ్సిడీ, రుణం ద్వారా ఇస్తుండడంతో తమకే ఈ యూనిట్ వచ్చేలా చేయాలంటూ కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో కొందరు తెగ పావులు కదుపుతున్నారు. రూ. పది లక్షల యూనిట్ విభాగంలో ఇచ్చే కార్లు, ట్రక్కులు, ఆటోలకు ప్రభుత్వం నుంచి నలభై శాతం సబ్సిడీ వస్తుండడం, మరో 55 శాతం బ్యాంకు నుంచి రుణం మంజూరుకానుండడంతో తమకే రుణం వచ్చేలా చూడాలంటూ వివిధ పార్టీల నేతలను ఆశ్రయిస్తున్నారు. ఖర్చు అయినా ఫర్వాలేదని పథకానికి ఎంపికచేయాలంటూ అధికారులకు ఫోన్లు చేయిస్తున్నారు. అటు ఇదే అదనుగా కొందరు చోటా నేతలు దరఖాస్తుదారుల నుంచి ముందే కమీషన్లు పుచ్చుకుంటూ రుణ మంజూరుకు హామీలు కూడా ఇచ్చేస్తున్నారు. వాస్తవానికి వైసీపీ అయిదేళ్ల పాలనలో ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు పూర్తిగా మంగళం పాడేసింది. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో మళ్లీ ఇన్నేళ్ల తర్వాత రుణాలు ఇస్తుండడంతో పోటీ అధికంగా ఏర్పడింది. ఉమ్మడి జిల్లాకు మొత్తం 2,732 యూనిట్లు మంజూరుకాగా ఇప్పటివరకు 13,317 మంది దరఖాస్తు చేసుకున్నారు. శనివారం చివరి రోజు పూర్తికావడంతో మళ్లీ గడువు పొడిగిస్తారా లేదా అనేది స్పష్టం కావాల్సి ఉంది.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

నిరుపేద ఎస్సీ సామాజిక వర్గంలో యువత, మహిళలకు స్వయం ఉపాధి కల్పించే ఉద్దేశంతో రాష్ట్రప్రభుత్వం ఇటీవల ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వివిధ యూనిట్లను మంజూరు చేసింది. అర్హులైన వారికి వీటిని సబ్సిడీ, రుణం ద్వారా ఇవ్వడానికి దరఖాస్తులను ఆహ్వానించింది. మొత్తం 32 రకాల స్వయంఉపాధి యూనిట్లు, వ్యాపారాలు చేసుకునేందుకు వీలుగా సబ్సిడీ ప్రకటించింది. అందులోభాగంగా ఐఎస్‌బీ సెక్టార్ టైప్-1 కింద ఫ్లవర్‌బొకేలు, వర్మీకంపోస్ట్ యూనిట్, వెబ్‌సైట్ డెవలప్‌మెంట్, ఎల్‌ఈడీ బల్బుల అసెంబ్లీ యూనిట్, ప్లంబింగ్, వాటర్ బాటిల్ రీసైక్లింగ్, వాటర్ రీసైక్లింగ్ యూనిట్లకు రూ.3 లక్షలు ఖర్చుకానుండగా, ప్రభుత్వం 60 శాతం సబ్సిడీ ఇవ్వనుంది. బ్యాంకు నుంచి 35శాతం రుణం, లబ్ధిదారుడు ఐదుశాతం పెట్టుబడి పెట్టాల్సి ఉంది. టైప్-2 కింద ఫిష్ ఫార్మింగ్, అడ్వంచర్ టూరిజం, సబ్బుల తయారీ, మొబైల్ కార్‌వాష్, బేకరీ, ఫ్లైయాష్ బ్రిక్ యూనిట్, సెరికల్చర్, వెల్డింగ్, బ్యూటీపార్లర్, మెడికల్ ల్యాబ్ వంటి వ్యాపారాలు చేసుకునేవిధంగా ఒక్కో యూనిట్‌కు రూ.3 లక్షలు కేటాయించింది. ఇందులో 40 శాతం సబ్సిడీ, 55 శాతం బ్యాంకు రుణం, ఐదుశాతం లబ్ధిదారుడి వాటా కింద ఈ యూనిట్లను ప్రకటించింది. టైప్-3 కింద రూ.10 లక్షలకంటే ఎక్కువ రుణం విభాగంలో ఈవీ బ్యాటరీ చార్జింగ్ యూనిట్ ప్రకటించింది. రవాణా రంగం విభాగంలో రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల రుణం కింద మూడు చక్రాల ప్యాసింజర్ ఈ-ఆటో, నాలుగు చక్రాల ఆటో, కారు, గూడ్స్‌ట్రక్, వ్యవసాయ విభాగంలో డ్రోన్లు రుణం కింద అందించాలని నిర్ణయించింది. వీటిలో ప్రభుత్వ సబ్సిడీ 40 శాతం, బ్యాంకు రుణం 55 శాతం కింద ఉంది. ఈ నేపథ్యంలో ఈ యూనిట్లు పొందేందుకు మే 10లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేలల్లో దరఖాస్తులు వెల్లువెత్తాయి. వైసీపీ ప్రభుత్వం గడచిన అయిదేళ్లలో ఎస్సీ కార్పొరేషన్‌ను పూర్తిగా మూసేసి ఎవరికీ రుణం అనేదే మంజూరు చేయలేదు. అయితే ప్రభుత్వం మారడంతో సీఎం చంద్రబాబు ఆదేశాలతో మళ్లీ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాల మంజూరుకు ఆదేశించింది. దీంతో ఇన్నేళ్ల తర్వాత పథకం తిరిగి ప్రారంభం కావడంతో భారీగా ఆశావహులు దరఖాస్తులు చేశారు. కాకినాడ జిల్లాకు 798 యూనిట్లు మంజూరవగా శనివారం నాటికి 5,497 మంది దరఖాస్తు చేశారు. కోనసీమ జిల్లాకు 1,043 యూనిట్లకుగాను 3,265 మంది, తూర్పుగోదావరి జిల్లాలో 891 యూనిట్లకు 4,555 మంది పోటీపడ్డారు.

సిఫార్సుల గోల..

ఇన్నేళ్ల తర్వాత పథకం అమలవుతుండడంతో ఈ యూనిట్లను దక్కించుకునేందుకు అప్పుడే పైరవీలు తీవ్రస్థాయిలో మొదలయ్యాయి. ఎలాగైనా తమకు పథకం వచ్చేలా చేయాలంటూ అనేకమంది దరఖాస్తుదారులు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో పైరవీలు చేయిస్తున్నారు. తమకు తెలిసిన నేతలను వెంటబెట్టుకుని అధికారులతో చెప్పాలంటూ తెగ ఒత్తిళ్లు తెస్తున్నారు. ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కష్టపడ్డామని, ఇప్పుడు పథకానికి ఎంపికయ్యేలా చేయాలంటూ అధికారులకు ఫోన్లు చేయిస్తున్నారు. ప్రధానంగా రూ.10 లక్షల యూనిట్ కింద ఇవ్వనున్న కార్లు, గూడ్స్‌ట్రక్, ఆటోల కోసం పైరవీలు ఎక్కువగా నడుస్తున్నాయి. కాకినాడలో అయితే ఇప్పటికే దరఖాస్తు రసీదుతో ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి మండలస్థాయి అధికారులకు చెప్పి తమ పేర్లు నమోదు చేయించాలని ప్రదక్షిణలు చేస్తున్నారు. కోనసీమలో యూనిట్లు కొంతవరకు ఎక్కువగా ఉండడంతో గడచిన వారం రోజులుగా ఎమ్మెల్యేల వద్దకు పైరవీకారులు పరుగులు తీస్తున్నారు. అటు తూర్పుగోదావరి జిల్లాలో ఉదయం లేచింది మొదలు పలువురు ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి కారు, ట్రక్కు, ఆటో తమకే వచ్చేలా చేయాలంటూ వెంటబడుతున్నారు. దీంతో కొందరు ఎమ్మెల్యేలు చేసేదిలేక అక్కడికక్కడే అధికారులకు ఫోన్లు చేసి ఫలానా వ్యక్తి తమవారని, కాస్త చూడండంటూ చెబుతున్నారు. ఇదే అదనుగా అధికారుల వద్దకు సైతం కొందరు దరఖాస్తుదారులు వెళ్లి ఎమ్మెల్యే చెప్పిన వ్యక్తి తామేనంటూ గుర్తుచేస్తున్నారు. ఇలా ఇప్పుడు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రవాణా రంగం విభాగంలో ఇచ్చే యూనిట్ కోసం తెగ పైరవీలు చేస్తున్నారు. పథకం కింద రూ.10 లక్షల కారు తీసుకుంటే ఎలాగూ రూ.4 లక్షలు ప్రభుత్వం నుంచి సబ్సిడీ వస్తుండడంతో ఎక్కువమంది వీటికోసం తెగ పావులు కదుపుతున్నారు. అయితే అనేక నియోజకవర్గాల్లో దరఖాస్తుదారులపై గురిపెట్టి కొందరు చోటామోటా నేతలు పథకానికి ఎంపికయ్యేలా చూస్తామంటూ అప్పుడే సెట్టింగ్‌లు చేసుకుంటున్నారు. రూ.4 లక్షలు ఉచితంగా వస్తున్న నేపథ్యంలో తమకు రెండు విడతలుగా లక్ష ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. ఇలా ఉమ్మడి జిల్లాలో అనేకచోట్ల ఈ తంతు నడుస్తోంది. అటు పోటీ తీవ్రంగా ఉన్న నేపథ్యంలో రూ.లక్ష ఇచ్చుకుంటే కచ్చితంగా ఎంపికవుతామని కొందరు నమ్ముతుండడం విశేషం. ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీతో చెప్పి పనిచేయిస్తామంటూ దళారులు వీరికి ఎరవేస్తున్నారు.

బాధ్యతల బరువు!



- తూనికలు, కొలతల శాఖను వేధిస్తున్న సిబ్బంది కొరత
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సగానికిపైగా పోస్టులు ఖాళీ
- నలుగురు ఉండాల్సినచోట ఒక్కరే విధులు
- పని ఒత్తిడితో సతమతమవుతున్న ఇన్‌స్పెక్టర్లు
- తూతూమంత్రంగా తూనికలు, కొలతల శాఖ తనిఖీలు

ఓవైపు నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. మరోవైపు తూకాల్లో మోసాలు వినియోగదారులను నష్టపరుస్తున్నాయి. నిత్యం దాడులు నిర్వహించి ఈ తరహా మోసాలను అరికట్టాల్సిన తూనికలు, కొలతల శాఖ అధికారులు మాత్రం చోద్యం చూడాల్సిన పరిస్థితి. దీనికి ప్రధాన కారణం ఆ శాఖలో సిబ్బంది కొరత.. అవును.. ఆ శాఖను ఈ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. నలుగురు సిబ్బంది ఉండాల్సిన చోట కేవలం ఒక్కరంటే ఒక్కరు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఎంతో కీలకమైన ఈ శాఖలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో క్యాజువల్ సిబ్బంది 33 మందికి 16 మందే ఉన్నారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కూరగాయల మార్కెట్ మొదలు రైసుమిల్లులు, పెట్రోల్ బంకులు, వస్త్ర, కిరాణా, ఆయిల్, చికెన్, మటన్ దుకాణాలు, సినిమా హాళ్లు, వాణిజ్య సముదాయాలు, బస్టాండ్లలో దుకాణాలు, బండ్లు, ఆటోమొబైల్, ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్స్. ఇలా తూకాలు, కొలతలు వేసే ప్రతి దుకాణం తూనికలు, కొలతలశాఖ పరిధిలోకి వస్తుంది. ప్రభుత్వ, ప్రైవేటుగా ఎలాంటి వస్తువులనైనా ప్యాకింగ్ చేసి నిబంధనలు అతిక్రమించినా, నిర్ణీత ధరలకంటే అధికంగా విక్రయించినా చర్యలు తీసుకోవచ్చు. వీటన్నింటినీ ఆ శాఖ అధికారులు పూర్తిస్థాయిలో చేయలేకపోతున్నారు. తీవ్ర పని ఒత్తిడితో సిబ్బంది సతమతమవుతున్నారు. బంగారు దుకాణాలు, గ్యాస్ ఏజన్సీలు, వేబ్రిడ్జిలు, కూరగాయల మార్కెట్లు తదితరాల్లో ఎమ్మార్పీలు, డేటా ఆఫ్ ప్యాకింగ్.. ఇలాంటి వాటిపై దాడులు జరిపి మోసాలు అరికట్టాల్సి ఉన్నా.. ఆ దిశగా సమర్థంగా పనిచేయలేకపోతున్నారు. ఏడాదికోసారి ఆయా దుకాణాల్లో వినియోగించే కాటాలను తనిఖీ చేయాలి. ఇవన్నీ చేయడం ఉన్న సిబ్బందికి కష్టంగా మారింది. ప్రస్తుతం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని తనిఖీ ఇన్‌స్పెక్టర్లు బహు పాత్రలు పోషించాల్సి వస్తోంది.

పని భారం పెరిగి..

కాకినాడ జిల్లాలో ప్రస్తుతం ఒక అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫీసర్, కాకినాడ, పెద్దాపురం డివిజన్లకు ఒక్కొక్కరు చొప్పున తనిఖీ ఇన్‌స్పెక్టర్లు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోను ఒక అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫీసర్, అమలాపురం, రామచంద్రపురంల్లో ఇద్దరు తనిఖీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఒక ఏసీ, సర్కిల్-1,2ల్లో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. 8 నుంచి పది మండలాలకు ఒక ఇన్‌స్పెక్టర్ ఉంటారు. ఒక్కో మండలంలో 20కి పైగా గ్రామాలు ఉంటాయి. ఒక గ్రామంలో చిన్న, పెద్ద.. ఏవైతేనేం కనీసం 20 నుంచి 40 వరకు దుకాణాలు ఉంటాయి. వీటిలో దాదాపు అన్నిచోట్లా సరుకును తూకం వేయాల్సిందే. ఈ సమయంలో వీటన్నింటినీ ఒక ఇన్‌స్పెక్టర్ మాత్రమే తనిఖీ చేయాల్సి రావడం తలకు మించిన భారమవుతోంది. దానికితోడు ఈ మండలాలు అన్నిటికీ ఒక్కరే తన సొంత వాహనంపై వెళ్లి తిరిగి రావాలి. ఒకవేళ ఎక్కడైనా తూకాల్లో తేడా వచ్చి సరుకును సీజ్ చేస్తే.. దాన్ని వెంట పెట్టుకుని ఆఫీసుకు తీసుకురావాలి. ప్రస్తుతం ఈ బాధ్యతంతా ఒక్క ఇన్‌స్పెక్టర్‌పైనే పడుతోంది. జిల్లాలో క్యాజువల్ సిబ్బంది 33 మంది ఉండాల్సి ఉండగా 16 మందే ఉన్నారు. 2007 నుంచి ఇన్‌స్పెక్టర్ల రిక్రూట్‌మెంట్ లేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం ఆరుగురు ఇన్‌స్పెక్టర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక టెక్నికల్ అసిస్టెంట్లు రెండు ఖాళీలు ఉన్నాయి. అటెండర్ల పోస్టులు ఆరు ఖాళీగా ఉన్నాయి.

ఒక్కరంటే ఒక్కరే..

కోనసీమ జిల్లాలోని రామచంద్రపురం ఆఫీసులో ఇన్‌స్పెక్టర్ ఒక్కరే ఉన్నారు. ఉదయం ఆఫీసు తాళం తీయడం, పనిచేసుకోవడం, సాయంత్రం తిరిగి తాళం వేసుకోవడం అన్నీ ఆయనే చేసుకోవాల్సిన పరిస్థితి. ఇక అమలాపురం ఆఫీసులో ఇన్‌స్పెక్టర్‌ది కూడా అదే పరిస్థితి. అదనంగా కొవ్వూరు బాధ్యతల భారం కూడా ఆయనదే.. కొవ్వూరులో ఉంటే అమలాపురంలో కనిపించరు.. అమలాపురంలో ఉంటే కొవ్వూరులో ఉండరన్నమాట. ఇక కాకినాడ జిల్లా పెద్దాపురం, తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలోనూ అదే పరిస్థితి. ఒక్కరే ఇన్‌స్పెక్టర్. అక్కడ అన్ని వ్యవహారాలూ వారే చక్కబెట్టుకోవాలి. ఒకప్పుడు ఇన్‌స్పెక్టర్, టెక్నికల్ అసిస్టెంట్, అటెండర్, చౌకీదారు.. ఇలా ఒక బృందం పనిచేసేది. ప్రస్తుతం ఇన్‌స్పెక్టర్ ఒక్కరే అన్ని విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. ఎక్కడికక్కడ సిబ్బంది రిటైర్ అయినా ఈ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయని పరిస్థితి. కనీసం ఇతర విభాగాల నుంచి సిబ్బందిని కూడా ఈ శాఖకు అనుసంధానం చేయలేదు. ప్రస్తుతం తూనికలు, కొలతలశాఖలో నగదు రూపంలో చెల్లింపులు నిలిపివేశారు. ఏదైనా సరే ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి. వీటిపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఆ శాఖ సిబ్బందిదే. ఎంతో కీలకమైన ఈ శాఖలోకి కనీసం సచివాలయాల సిబ్బందినైనా డిప్యూటేషన్‌పై పంపితే ఆ శాఖ బలోపేతమయ్యే అవకాశం ఉంది. తూనికలు, కొలతల శాఖలో తక్షణం ఖాళీలను భర్తీ చేస్తేనే వినియోగదారులకు సరైన న్యాయం జరిగే అవకాశం ఉంది.



ద్రాక్షారామలో ఇండస్ట్రియల్ పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సుభాష్

ఇండస్ట్రియల్ పార్కులతో ఇంటికో పారిశ్రామికవేత్త

ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి యువత ఎదగాలన్నదే సీఎం ఆలోచన

ఎంఎస్‌ఎంఈ శంకుస్థాపనలో మంత్రి సుభాష్

ద్రాక్షారామ,మే10(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గానికో పారిశ్రామిక భవన సముదాయం నిర్మాణంతో ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే లక్ష్యం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని మంత్రి సుభాష్ అన్నారు. శనివారం రామచంద్రపురం మండలం ద్రాక్షారామలో రూ. 11.5 కోట్లతో నిర్మించనున్న ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సు మంత్రి సుభాష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవం తీసుకురావాలని సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 39 ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సులను ప్రభుత్వం మంజూరుచేసిందన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో 4 ఎకరాల విస్తీర్ణంలో రూ11.5 కోట్లతో 26వేల చదరపు అడుగుల నిర్మిత స్థలంలో కాంప్లెక్సు నిర్మిస్తున్నామన్నారు. కాంప్లెక్సులో వివిధ రకాల పారిశ్రామిక యూనిట్ల స్థాపనకు మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలకు ప్లగ్ అండ్ ప్లే విధానంలో ప్లాట్లు కేటాయిస్తామన్నారు. యువత ఉద్యోగాలు పొందడమే కాకుండా ఉద్యోగాలు కల్పించే దిశగా ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. రానున్న ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే సంకల్పంతో చేస్తున్న కృషిలో ఇప్పటివరకు 8 లక్షల కోట్లు పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకురావడం జరిగిందని మంత్రి తెలిపారు. రామచంద్రపురం వీఎస్‌ఎం కళాశాల సమీపంలో సీఎస్‌ఆర్ నిధులతో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ మాట్లాడుతూ రామచంద్రపురంలో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సు ఏర్పాటుకు మంత్రి సుభాష్ కృషిచేశారని, రెండువారాల్లో టెండర్లు పిలిచి కాంప్లెక్సు నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు. ఆ కాంప్లెక్సులో 1300 చదరపు అడుగుల విస్తీర్ణం గల 20 యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో అఖిల, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ రమణారెడ్డి, జీఎం ఇండస్ట్రీస్ ప్రసాద్, ఎంపీడీవో కడలి పద్మజ్యోతి, ఎంపీపీ అంబటి భవానీ, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు

వాటర్ వార్ రూమ్స్

- తాగునీటి సమస్యల్లేకుండా చర్యలు తీసుకోండి
- ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు ప్రభుత్వం ఆదేశం



జిల్లాలో వేసవిలో తాగునీటి ఎద్దడి అవసరాలు తీర్చడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందుకోసం జిల్లాలో తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో వాటర్ వార్ రూమ్స్ ద్వారా నీటిఎద్దడికి చెక్ పెట్టాలని నిర్ణయించారు. వేసవిలో ప్రజలు ఎదుర్కొనే తాగునీటి అవసరాలపై వస్తున్న వార్తా కథనాలను దృష్టి ఉంచుకుని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా వాటర్ వార్ రూమ్స్ ఏర్పాటుపై కీలక ప్రకటన చేశారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు చేపట్టారని సమాచారం.

అమలాపురం, మే10(ఆంధ్రజ్యోతి): వేసవిలో మంచినీటి ఎద్దడి నివారణకు రాష్ట్రవ్యాప్తంగా రూ.28 కోట్లను కేటాయించడంతోపాటు వాటర్ వార్ రూమ్స్ నిర్వహణ తీరుపై గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులతో ప్రభుత్వం ఓ సమీక్ష కూడా చేసి సూచనలు చేసింది. దీనిలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని తాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్న ప్రాంతాన్ని గుర్తించి ప్రజలకు సత్వరం నీటిని అందించేందుకు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమయ్యారు. ఎక్కడ తాగునీటి ఎద్దడి ఉంది. వారి అవసరాలు ఎలా తీర్చాలి అనేదానిపై ప్రణాళికలు సిద్ధం చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా తాగునీరు సమస్య ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడంతో పాటు అక్కడ ఉన్న ఆర్‌డబ్ల్యుఎస్ ప్రాజెక్టుల ద్వారా ఇంటింటికీ నీటిని అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఈ వాటర్ వార్ రూమ్స్ ఏర్పాటుపై జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయి అధికారుల వరకు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ సమీక్షలు చేయాలని జిల్లా డివిజనల్, మండలస్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్సులు నిర్వహించి క్లిష్టమైన ప్రాంతాల్లో నీటి ఎద్దడిని నివారించడానికి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాతోపాటు ప్రైవేటు వాటరు ట్యాంకులను అద్దెకు తీసుకుని తాత్కాలిక నీటి సరఫరా వ్యవస్థను ఏర్పాటుచేయడానికి జిల్లాలోని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చర్యలు చేపట్టారు. చేతిపంపులకు మరమ్మతులు చేయడం, నీటి సరఫరా వ్యస్థలను మెరుగుపరచడం, ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరాలో లోపాలను అధిగమించడం వంటి చర్యలను అధికారులు చేపట్టాల్సిందిగా సూచించారు. ఎక్కడెక్కడ వాటర్ సోర్సులు ఉన్నాయో వాటిని గుర్తించి మ్యాపింగ్ చేయడంతోపాటు తాగునీటి సమస్య పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందనే భరోసా ప్రజలకు కల్పించాల్సిన అవశ్యకతపై ప్రభుత్వం దృష్టి సారించింది. రానున్న రోజుల్లో నీటి సమస్య తీవ్రమయ్యే పరిస్థితులు ఉన్న దృష్ట్యా స్వచ్ఛమైన తాగునీరు అందించడంతోపాటు పశుపక్ష్యాదులకూ నీరందేలా చర్యలు చేపట్టారు.



మండపేటలో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న దృశ్యం

అకాలవర్షం.. తీరని నష్టం

తడిసి మొలకెత్తిన ధాన్యం

కొనేవారులేక అన్నదాతల ఎదురుచూపులు



మొలకలెత్తిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు హరిబాబు

మండపేట, మే 10 (ఆంధ్రజ్యోతి) ఆకాలవర్షం చేతికందిన పంటను ముంచేసింది. పండిన పంట ఒబ్బిడి చేసుకున్న బొండాల ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి కొనేవారులేక కల్లాల్లోనే రాశులుగా పోసి ఉంచుతున్నారు. మిల్లర్లకు సంబంధించి సీఎంఆర్ లేకపోవడంతో ఈ ధాన్యాన్ని కొనేవారులేక ఏంచేయాలో తెలియని దుస్థితిలో రైతులు ఉన్నారు. కొందరు అయినకాడికి దళారులకు విక్రయిస్తుండగా, కొందరు ఆరుదల కోసం ఎండబెడుతున్నారు. ఈ దశలో శుక్రవారం కురిసిన అకాలవర్షానికి మండపేట రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలో ధాన్యం తడిసిముద్దయింది. పలుచోట్ల ధాన్యం రాశుల కిందకు నీళ్లువెళ్లి మొలకలెత్తాయి. దీంతో ఈ తడిసిన ధాన్యాన్ని శుక్రవారం రైతులు కల్లాలు, రోడ్లపై ఆరబోసుకుని ఒబ్బిడిచేసుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలుచేసి తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.



ఏమిటిది... ఎలా పనిచేస్తుంది

ఎల్‌హెచ్‌ఎంఎస్.. ఇది ఓ నిఘా కెమెరా. ఇంటికి తాళం వేసి ఊరెళ్తున్న వారు పోలీసులకు సమాచారం అందిస్తే దానిని ఆ ఇంట్లో ఏర్పాటుచేసి వెళతారు. ఈ సేవలు పూర్తిగా ఉచితం. గరిష్ఠంగా 15 రోజుల వరకు ఇంట్లో ఈ సిస్టమ్ ఉంచే అవకాశం ఉంది. ఇంటి యజమానులు ముందుగా తమ ఏరియా పరిధిలోని పోలీసులకు సమాచారం ఇవ్వాలి. తమ ఇంటికి ఎల్‌హెచ్‌ఎంఎస్ సిస్టం అమర్చాలని కోరాలి. అప్పుడు వారు ఈ కెమెరాను ఇంటిలోపల అమర్చుతారు. దొంగలు ఎవరైనా ఇంట్లోకి ప్రవేశిస్తే పోలీసు కేంద్ర కార్యాలయంలో అలారం మోగుతుంది. అంతే కాదు.. ఇంటి యజమాని, సమీప పోలీసు స్టేషన్‌కు కూడా సమాచారం వెళ్తుంది. దీంతో పోలీసులు ఐదు నిమిషాల వ్యవధిలో ఘటనా స్థలానికి చేరుకుని చోరీని అడ్డుకునే అవకాశం ఉంది. దొంగలను కూడా పట్టుకుంటారు. 2017లో టీడీపీ ప్రభుత్వ హయాంలో వీటిని అందుబాటులోకి తీసుకొచ్చి విస్తృత ప్రచారం చేశారు.





పరీక్షలు పూర్తయ్యాయి. స్కూళ్లకు వేసవి సెలవులు ఇచ్చేశారు. సమ్మర్ టూర్లకు చాలా మంది సిద్ధమవుతుంటారు. పిల్లలను తీసుకుని సరదాగా గడిపేందుకు ఊర్లు వెళ్తారు. కొంతమంది నగరాలు, పట్టణాల నుంచి సొంతూళ్లకు వెళితే.. మరికొందరు పుణ్యక్షేత్రాలు, వేసవి విడిదులకు వెళ్లి వస్తుంటారు. ఇక ఇదే అదునుగా చోరులు కూడా రెచ్చిపోతుంటారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుల్ల చేస్తుంటారు. ఏటా వేసవి వచ్చిందంటే చాలు దొంగలకు పండగే.. పొద్దున్న రెక్కీ నిర్వహించడం.. రాత్రికి ఇళ్లను కొల్లగొట్టడమే వీరి పని. అయితే ఇటువంటి చోరీలకు పాల్పడేవారికి చెక్ పెడుతున్నారు కాకినాడ జిల్లా పోలీసులు. ఎల్‌హెచ్‌ఎంఎస్ (లాక్డ్ హౌస్ మానటరింగ్ సిస్టం)తో వారి ఆటకట్టిస్తున్నారు.

ఊరెళ్తున్నారా...

(ఆంధ్రజ్యోతి-కాకినాడ)

LHMS AP Police

- ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలపై కాకినాడ జిల్లా పోలీసుల విస్తృత ప్రచారం
- ఇళ్ల దొంగతనాలకు అడ్డుకట్ట వేయాలని పిలుపు
- నిఘా కెమెరాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచన

కాస్త చెప్పి వెళ్లండి!

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఈ ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై పోలీసు యంత్రాంగం విస్తృత ప్రచారం చేస్తోంది. సెలవుల్లో ఊర్లకు, టూర్లకు వెళ్లే వారు కచ్చితంగా ఈ సేవలను వినియోగించుకోవాలని సూచిస్తున్నారు. మరోవైపు ఈ సిస్టమ్‌పై అవగాహన ఉన్న వారు ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. కాకినాడ జిల్లాలో ప్రస్తుతం 44 కెమెరాలను అందుబాటులో ఉంచారు. కాకినాడ వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్, సర్పవరం, ఇంద్రపాలెం, పోర్టు, గొల్లప్రోలు, పెద్దాపురం, సామర్లకోట, తుని పోలీసు స్టేషన్లలో ఈ కెమెరాలను అందుబాటులో ఉంచారు. గతేడాది ఈ సేవలను సుమారు 38 ఇళ్ల యజమానులు వినియోగించుకున్నారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాలను అమర్చడమే కాదు.. ఇద్దరు కానిస్టేబుళ్ల నిఘా కూడా ఆ ఇంటి పరిసరాల్లో ఉంటుంది.

యాప్ కూడా ఉంది...

ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏపీ పోలీసు అనే యాప్ కూడా అందుబాటులో ఉంది. ఈ యాప్‌ను మీ మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసి ముందుగా రిజిస్టర్ అవ్వాలి. రిక్వెస్ట్ పోలీస్ వాచ్ అని ఉంటుంది. దానిపై క్లిక్ చేసి మీ వివరాలు, ఇంటి చిరునామా వివరాలు, మొబైల్ నెంబరు పొందుపరచాలి. మీరు ఉండే లోకేషన్ చూపిస్తుంది. తర్వాత మీ మొబైల్‌కు ఓటీపీ వస్తుంది. అలాగే మీ రిజిస్ట్రేషన్ విజయవంతమైనట్టుగా సాధారణ మెసేజ్ రూపంలో రిజిస్ట్రేషన్ నెంబరు వస్తుంది. ఆ నెంబరును వాచ్ రిక్వెస్ట్ ఫామ్‌లో ఎంటర్ చేసి.. ఎప్పుడు ఊరెళుతున్నారు? ఎప్పుడు వస్తారు? తేదీలను నమోదు చేయాలి. ఆ సమాచారం ఆధారంగా ఎల్‌హెచ్‌ఎంఎస్ సర్వీస్ యాక్టివేషన్ ప్రారంభమవుతుంది.





సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే..

ఇంట్లో, ఇంటి బయట సీసీ కెమెరాలు తప్పనిసరిగా వేయించుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. ఒక సీసీ కెమెరా వేయి కళ్లతో సమానమని చెప్తున్నారు. ప్రస్తుతం నేర, చోరీ సంబంధిత కేసుల్లో సీసీ కెమెరాలే కీలకంగా మారుతున్నాయంటున్నారు. రూ.లక్షలు ఖర్చు పెట్టి ఇంటి నిర్మాణం చేసుకునేవారు.. కేవలం రూ.పదివేలలోపు ఉండే సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే నిరంతర పర్యవేక్షణ ఉంటుందని సూచిస్తున్నారు.

పర్యవేక్షణ పెంచాం

జిల్లాలో చోరీలను అరికట్టేందుకు గట్టి నిఘా, గస్తీ నిర్వహిస్తున్నాం. రాత్రివేళల్లో వాహనాలను తనిఖీ చేయిస్తున్నాం. అపరిచిత వ్యక్తులపైన, ఆరా, పాత నేరస్తులపైన నిఘా ఉంచుతున్నాం. పగలు, రాత్రి కూడా డ్రోన్లతో పర్యవేక్షిస్తున్నాం. ముఖ్యంగా సెలవుల్లో ఊర్లకు, విహారయాత్రలకు వెళ్లే వారు కచ్చితంగా ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను వినియోగించుకోవాలి. ఇళ్ల దొంగతనాలు అరికట్టేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. మీ సమీప పోలీసు స్టేషన్లో సమాచారం ఇస్తే వీటిని అందజేస్తారు.



జి.బిందుమాధవ్
ఎస్పీ కాకినాడ జిల్లా

ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలన చేయాలి

సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మాజీ జేడీ లక్ష్మీనారాయణ

పెద్దాపురం, మే 10(ఆంధ్రజ్యోతి): పెద్దాపురం ఏడీబీ రోడ్డులో భారతీయ విద్య భవన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కూల్ పరిచయం కార్యక్రమంలో జేడీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వంతో భారత్-పాక్ సీజ్ ఫైర్‌కు అంగీకరించాయన్నారు. అణ్వస్త్ర ఆయుధాలు కలిగి ఉన్న రెండు దేశాలు యుద్ధం చేయడం ప్రపంచ శాంతికి ప్రమాదకరమన్నారు. ఇందులో భాగంగానే భారత్-పాక్ మధ్య చర్చల ద్వారా కాల్పుల విరమణ జరగాలని ప్రపంచ దేశాలు సూచించాయి. చర్చలు పాక్ ఉగ్రవాదాన్ని ప్రేరేపించడాన్ని పూర్తి స్థాయిలో అడ్డుకోవాలన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఓ కమిటీ వేసి ఉగ్రవాదాన్ని వంద శాతం పరిసమాప్తం చేయాలని లక్ష్మీనారాయణ అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చినరాజప్ప, కౌడా తుమ్మల బాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పెద్దాపురప్పాడు గంగమ్మ జాతర

కరప, మే 10(ఆంధ్రజ్యోతి): పెద్దాపురప్పాడు గ్రామదేవత గంగమ్మతల్లి జాతరను ఆదివారం నుంచి మూడు రోజుల బాటు వైభవంగా నిర్వహించనున్నారు. మూడేళ్లకోసారి నిర్వహించే ఈ జాతరకు ఒక ప్రత్యేకత ఉంది. పూర్వం గ్రామంలోని గొల్లపల్లి వంశీకుల పొలాల్లో గోవతాళ్ల రూపంలో అమ్మవారు దొరకడంతో అప్పట్నుంచి గ్రామదేవతగా కొలుస్తున్నట్టు గ్రామస్తులు చెబుతారు. గోవతాళ్లను తాటాకుల బుట్టలో ఉంచి గుడి లోపల దూలానికి వేలాడదీస్తారు. ఆదివారం ఉదయం గోవతాళ్ల బుట్టను కిందకు దించి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. సోమ, మంగళవారాల్లో అమ్మవారిని ఊరేగించి ప్రత్యేకపూజలు చేస్తారు. ఈ జాతరకు దాదాపు 150 గ్రామాల్లో ఉండే గొల్లల కుటుంబాల వారు విచ్చేసి పండుగ మూడురోజులు గుడి ప్రాంగణంలో వేసిన చలువ పందిళ్లకు వేలాడుతూ తప్పెట గుళ్లు ఆడుతారు. నెలరోజుల ముందుగానే ఈ మేరకు ఆ కుటుంబాలకు అమ్మవారి శేష అక్షింతలతో కూడిన ప్రత్యేక ఆహ్వాన పత్రికలు అందుతాయి. గంగమ్మతల్లి జాతరను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి వేలాదిమంది భక్తులు తరలివస్తారు. దీనికి తగ్గట్టుగా అన్ని ఏర్పాట్లు చేసినట్టు మాజీ సర్పంచ్ గొల్లపల్లి ప్రసాదరావు, ఆలయ కమిటీ సభ్యులు గొల్లపల్లి అప్పన్నకాపు, గొల్లపల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు, కనకాల రామ్మోహనరావు, గొల్లపల్లి శ్రీనివాస్, గొల్లపల్లి గంగాప్రసాదరావు తదితరులు తెలిపారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కరప ఎస్‌ఐ తోట సునీత ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.



అమ్మవారి ప్రతిరూపంగా కొలిచే బుట్టలోని గోవతాళ్లు

ఆకట్టుకున్న చిన్నారుల నృత్యప్రదర్శన

నల్లజర్ల, మే 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వేణు గోపాలస్వామి తిరుకల్యాణోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా శనివారం కనకదుర్గ భక్తసమాజం ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణం, నిత్య హోమం, కుంకుమ పూజలు నిర్వహించారు. సాయంత్రం క్రేజీ మాస్టర్ డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో చిన్నారులతో నిర్వహించిన కూచిపూడి, వెస్ట్రన్ డ్యాన్స్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆదివారం రాత్రి ఏడుగంటలకు స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ మద్దిపాటి చంద్రశేఖర్ తెలిపారు.

యువతి ఆత్మహత్యాయత్నం

రక్షించిన పోలీసులు

కొవ్వూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రేమలో విఫలమవ్వడంతో గోదావరిలో ఓ యువతి దూకి ఆత్మహత్యాయత్నానికి యత్నించడంతో పట్టణ పోలీసులు రక్షించారు. వివరాలివి... నిడదవోలు పట్టణానికి చెందిన 21 సంవత్సరాల యువతి వైజాగ్‌లో అప్తామాలజిస్టు చదువుతుంది. లవ్ ఫెయిల్ కావడంతో శనివారం సాయంత్రం రోడ్డు కం రైలు వంతెన పైనుంచి గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నానికి యత్నించింది. పోలీసులు రక్షించి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. కౌన్సెలింగ్ ఇచ్చి యువతి తల్లికి అప్పగించారు.

6ఏ కేసు నమోదు

గోపాలపురం, మే 10 (ఆంధ్రజ్యోతి): కరగపాడు రేషన్ షాప నెంబర్- 33 ఇన్‌చార్జిపై 6ఏ కేసు నమోదు చేసినట్టు సివిల్ సప్లై డీటీ దివాకర్ శనివారం తెలిపారు. శుక్రవారం రాత్రి తనిఖీ చేయగా, రికార్డు స్టాకుకు 15 క్వింటాళ్ల బియ్యం వ్యత్యాసం ఉన్నట్టు గుర్తించామన్నారు. దీంతో నిర్వాహకురాలిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

భక్తజన నీరాజనం

- వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు
- స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.53 లక్షలు



వాడపల్లి వెంకన్న ఆలయంలో భక్తులు



ఆత్రేయపురం, మే 10 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్ర పుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తీరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.53,00,904 లక్షలు లభించినట్టు ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. స్వామివారి సన్నిధిలో సత్యసాయి బా లవికాశ్ విద్యార్థులచే భక్తులకు రసనా చలివేంద్రం అందించారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖులు స్వామివారిని దర్శించుకుని వేదాశీర్వచనం అందుకున్నారు.

ఊక బస్తాలే.. రేషన్ బస్తాలు

రాజాపూడి రేషన్ డీలర్ మాయాజాలం

బియ్యాన్ని అమ్మేసుకున్న వైనం..



బియ్యానికి బదులు ఊకతో నింపిన బస్తాలు

జగ్గంపేట రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రాజపూడి గ్రామంలో రేషన్ డీలర్ మాయాజాలం అధికారులను ఆశ్చర్యానికి గురి చేసింది. రేషన్ బస్తాలకు బదులు ఊక బస్తాలను రేషన్ స్టాక్‌గా చూపించిన వైనం వెలుగులోకి వచ్చింది. రేషన్ బియ్యాన్ని విక్రయించుకుని ఊక బస్తాలను స్టాక్‌గా చూపిస్తూ అధికారులను డీలర్ బురిడీ కొట్టించాడు. లబ్ధిదారులు ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారులు రంగంలోకి దిగి అక్రమాలను వెలికితీశారు. రాజాపూడి గ్రామంలో షాపు నెంబర్ 041805లో 602మంది లబ్దిదారులకు గాను ఇప్పటివరకు 240 మంది రేషన్ తీసుకున్నారు. ప్రస్తుతం ఈ షాపులో 5,255 కిలోల బియ్యం స్టాక్ ఉండాల్సిన ఉండగా 265 కిలోలు మాత్రమే ఉంది. అధికారులు స్టాక్ పాయింట్‌ను చెక్ చేయగా 45 బస్తాల్లో రేషన్ బియ్యానికి బదులు ఊక బస్తాలు ఉన్నట్టు గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించడంతో డిపోను సీజ్ చేశామని, తదుపరి చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదించినట్టు జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్.సత్యనారాయణ రాజు తెలిపారు. కార్యక్రమంలో సహాయ పౌర సరఫరాల అధికారి టి.ప్రసన్న లక్ష్మి, తహశీల్దార్ రమేష్ పాల్గొన్నారు.



డీలర్ నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు

బాలబాలాజీ ఆలయంలో భక్తుల కోలాహలం



బాలబాలాజీ దర్శనానికి బారులు తీరిన భక్తులు

మామిడికుదురు, మే 10(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం భక్తుల కోలాహలంతో కళకళ్లాడింది. వేకువజాము నుంచే భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. అర్చక స్వాములు వేద మంత్రోచ్చారణల నడుమ సుప్రభాత సేవ నిర్వహించి స్వామివారికి తొలి హారతి ఇచ్చారు. శనివారం పురస్కరించుకుని స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. కొత్త, పాత ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శనివారం స్వామివారిని 5,500మంది దర్శించుకుని 3200మంది నిత్యాన్నదాన పథకంలో అన్నదానం స్వీకరించారని, వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.4,06,417 ఆదాయం వచ్చిందని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందుల తలెత్తకుండా సహాయ కమిషనర్, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.



అప్పనపల్లి బాలబాలాజీస్వామి

తొలి తిరుపతికి పోటెత్తిన భక్తులు

ఆదాయం రూ.3,16,011



పెద్దాపురం, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొలి తిరుపతి శృంగార వల్లభస్వామి క్షేత్రానికి శనివారం సుమారు 15వేల మందికి పైగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారికి అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. రూ.3,16,011 ఆదాయం ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

కేశవస్వామి ఆలయంలో డిప్యూటీ కలెక్టర్ పూజలు



డిప్యూటీ కలెక్టర్‌కు స్వామి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, మే 10(ఆంధ్రజ్యోతి): పురాణ ప్రసిద్ధిగాంచిన ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో శనివారం సింహాచలం వరహాలక్ష్మి నరసింహస్వామి ఆలయ డిప్యూటీ కలెక్టర్ గీతాంజలి కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకున్నారు. అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు.

అన్నదాన పథకానికి రూ.1,11,116 విరాళం

కేశవస్వామి ఆలయంలో చేపడుతున్న నిత్యాన్నదాన పథకానికి తెలంగాణలోని శేరిలింగంపల్లికి చెందిన బళ్లా వీరభద్రం-సరిత దంపతులు రూ.1,11,116 విరాళం సమర్పించారు. దాతలకు స్వామి దర్శనం కల్పించి వేదశీర్వచనం అందజేశారు.





పిఠాపురంలో సూర్యోదయం వేళ అరుణ వర్ణ శోభితమైన ఆకాశం, పట్టణంలో సూర్యోదయ సమయాన అరుణకాంతులు



అరుణవర్ణంలో పిఠాపురంలోని రహదారి

ఆకాశం అరుణవర్ణ శోభితం

పిఠాపురంలో కనువిందు

ఆకాశం అరుణవర్ణ శోభితమైంది. సూర్యోదయ సమయాన శనివారం ఉదయం పిఠాపురం పట్టణంలో కనిపించిన దృశ్యాలు కనువిందు చేశాయి. ఆకాశం ఎరుపు రంగులోకి మారినట్లుగా సూర్యుడు చెట్లుచాటు నుంచి వస్తున్న దృశ్యాలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఆకాశమేగాక సూర్యకాంతితో రహదారి అంతా అరుణవర్ణంలో కనిపించింది. ఈ దృశ్యాలను ఆంధ్రజ్యోతి క్లిక్ మనిపించింది. - పిఠాపురం, (ఆంధ్రజ్యోతి)

ఏలేరులో నీటి నిల్వలు తగ్గుముఖం



తగ్గుతున్న ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు

ఏలేశ్వరం, మే10 (ఆంధ్రజ్యోతి):ఏలేరు జలాశయంలో నీటినిల్వలు తగ్గుముఖం పట్టాయి. ఎండతీవ్రత పెరగడంతో ఎగువ ప్రాంతం నుంచి నీటి ప్రవాహం తగ్గడంతో ఆయకట్టుకు నీటి సరఫరా నిలిపివేశారు. దీంతో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 86.56 మీటర్లుకాగా శనివారం 76.55 మీటర్లుగా నమోదైంది. పూర్తిస్థాయి నిల్వలసామర్థ్యం 24.11 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 9.74 టీఎంసీల మేర మాత్రమే నీటినిల్వలు ఉన్నాయి. ప్రస్తుతం విశాఖకు 200 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు.

అమ్మఒడి పేరుతో మోసంపై కేసు నమోదు

- ఆంధ్రజ్యోతి కథనంపై కలెక్టర్ ఆరా
- మోసానికి పాల్పడిన వారిని గుర్తించాలని ఆదేశం

పిఠాపురం, మే 10 (ఆంధ్రజ్యోతి): అమ్మఒడి పేరుతో ఫోన్‌కాల్స్ ద్వారా పలువురిని మోసగించిన సంఘటనపై కాకినాడజిల్లా పిఠాపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. అమరావతి సచివాలయం నుంచి ఆఫీసర్‌ను మాట్లాడుతున్నానంటూ ఒక వ్యక్తి పలువురికి ఫోన్‌చేసి మీకు అమ్మఒడి డబ్బులు గత ఏడాది పడలేదని, ఈఏడాదితో కలిపి రెండేళ్ల సొమ్ములు పడాలంటే తాను చెప్పినట్లు వాట్సాప్ షేరింగ్, ఫోన్ పే ద్వారా చేయాలని, ముందుకు రూపాయి పంపి ఆ తర్వాత లింక్‌ను క్లిక్ చేయాలనిచెప్పి ఓటీపీ చెప్పమని చెప్పి బ్యాంకు ఖాతాల నుంచి సొమ్ములు లాగేసి పలువురిని మోసంచేసిన సంఘటనపై ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైంది. పిఠాపురం నియోజకవర్గంలో పలువురికి ఈవిధంగా ఫోన్లు వచ్చి మోసపోయిన సంఘటనపై జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ స్పందించారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తా కథనంపై వివరాలు కోరారు. మోసానికి పాల్పడిన వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని కలెక్టర్ పోలీసులను ఆదేశించారు. ఎవరెవరికి ఫోన్లు వచ్చాయి, ఎంత మేర మోసపోయారు తదితర వివరాలు సేకరించాలని అధికారులకు సూచించారు. మరోవైపు అమ్మఒడి పేరుతో ఫోన్ రాగా తన ఖాతా నుంచి రూ.35వేలు కాజేశారని, తాను మోసపోయానంటూ గోకివాడ గ్రామానికి చెందిన రాంబాబు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై పిఠాపురం రూరల్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ జి.శ్రీనివాస్ తెలిపారు. గత రెండు రోజులుగా నియోజకవర్గంలో పలువురికి ఇదే విధంగా ఫోన్లు వచ్చినట్లు చెప్పారు. ఈ విధంగా ఎవరైనా డబ్బులు పోగొట్టుకుంటే సమీపంలోని పోలీసుస్టేషన్లల్లో ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. ఇటువంటి ఫేక్ కాల్స్‌కు ఎవ్వరూ స్పందించవద్దని కోరారు.

బీఐఎస్ సమన్వయ కమిటీ సభ్యుడిగా ఎస్పీ రెడ్డి



సర్పవరంజంక్షన్, మే 10(ఆంధ్రజ్యోతి): జాతీయ ప్రమాణాల సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తున్న బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) సమన్వయ కమిటీ సభ్యుడిగా కాకినాడ ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్పీ రెడ్డిని నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దేశంలో దివ్యాంగులకు అందిస్తున్న సహాయ పరికరాల నాణ్యతను పరిశీలన, ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వం బీఐఎస్ కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటుచేసిందని ఎస్పీ రెడ్డి తెలిపారు. జాతీయస్థాయి కమిటీలో ముగ్గురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఉండగా మానసిక దివ్యాంగులకు సేవలు అందించే విభాగంలో కోఆర్డినేషన్ కమిటీ సభ్యులుగా తనకు అవకాశం కల్పించినందుకు కేంద్రానికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నట్లు చెప్పారు. దివ్యాంగులకు నాణ్యమైన పరికరాలు, సేవలు అందేలా తనవంతు కృషి చేస్తానన్నారు.

80 స్లయిసెస్ సిటీ స్కాన్ యంత్రం ప్రారంభం

జీజీహెచ్(కాకినాడ) మే 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో అత్యాధునిక 80స్లయిసెస్ సిటీస్కాన్ యంత్రం అందుబాటులోకి వచ్చింది. ఈయంత్రాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ శనివారం ప్రారంభించారు. ఎస్ఎల్ డయాగ్నెసెస్ సంస్థ పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న సిటీ స్కాన్ యంత్రం ఇప్పటివరకు 16 స్లయిసెస్ సామర్థ్యంతో మాత్రమే నడిచేది. ఈసందర్భంగా డాక్టర్ విఠల్ మాట్లాడుతూ రోగుల తాకిడితో జీజీహెచ్‌పై ఒత్తిడి అధికమవుతున్న నేపథ్యంలో ఈ అధునాతన 80 స్లయిసెస్ సిటీస్కాన్ పరికరం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మనాభన్ శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.



సిటీ స్కాన్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ విఠల్

ఘనంగా పండిత సదస్యం





పండిత సదస్యం కార్యక్రమానికి హాజరైన వేదపండితులు, పొన్నవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

- సుమారు 192 మంది పండితులకు సత్కారం
- వేదఘోషతో పులకించిన సత్యదేవుడి సన్నిధి





పండితులను సత్కరిస్తున్న చైర్మన్ రోహిత్, ఈవో సుబ్బారావు

అన్నవరం, మే 10(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి శనివారం వేదఘోషతో పులకించింది. రాష్ట్రం నలుమూలల నుంచి వేదాలలో నిష్ణాతులైన పండితులు తమ వేదవిద్యను స్వామివారి పాదాలచెంత ఉంచి పునీతులయ్యారు. స్వామివారి దివ్య కల్యాణోత్సవాలలో భాగంగా శనివారం సాయంత్రం పండిత సదస్యం ఘనంగా జరిగింది. మధ్యాహ్నం 3గంటలకు నవవధూవరులైన సత్యదేవుడు, అనంత లక్ష్మీ అమ్మవార్లను మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ అనివేటి మండపం వద్దకు తోడ్కొనివచ్చారు. సర్వాంగసుందరంగా అలంకరించి న వేదికపై ఆశీనులు గావించి మరో వేదికపై క్షేత్ర పాలకులు సీతారాములను ఉంచి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పండితులంతా తమ పాండిత్యాన్ని స్వామిపాదాల చెంత వినిపించారు. అనంతరం రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన సుమారు 192మంది పండితులను పూలమాలలు, దుశ్శాలువా కప్పి, విసనకర్రను అందజేసిన గదు పురస్కారాలను ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్‌లు అందజేశారు. పండితులకు సుమారు రూ.6.80 లక్షలు వారి అకౌంట్‌లకు జమచేశారు. కార్యక్రమం అనంతరం పండితులంతా నవ దంపతులకు వేదాశీర్వచనాలు అందజేశారు.

పొన్నవాహనంపై విహరించిన స్వామి,అమ్మవార్లు

సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాలలో భాగంగా శనివారంరాత్రి నవదంపతులు పొన్నవాహనంపై విహరించారు. చైర్మన్ రోహిత్, ఈవో సుబ్బారావులు టెంకాయికొట్టి కార్యక్రమం ప్రారంభించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గ్రామోత్సవం వైభవంగా జరిగింది.

నేడు సత్యదేవుడి రథోత్సవం

- భక్తుల సౌకర్యార్థం మెయిన్‌రోడ్డులో దుకాణ సముదాయాల మూసివేత
- విద్యుత్ సరఫరా నిలిపివేత



స్వామివారు విహరించనున్న పెద్దరథం

అన్నవరం, మే 10 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాలలో భాగంగా ఆదివారం రథోత్సవ కార్యక్రమం జరుగనుంది. అత్యంత కీలకమైన ఈ రథోత్సవం నిర్వహణ, పర్యవేక్షణకు దేవదాయ కమిషనర్ రామచంద్ర మోహన్ ప్రత్యేకంగా ఇద్దరు డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారులను నియమించారు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10గంటల వరకు మెయిన్‌రోడ్డులో ఈ వేడుక జరుగనుంది. భక్తులు, గ్రామస్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని స్థానిక ఆంధ్రాబ్యాంక్ నుంచి కళాశాల మైదానం వరకు మెయిన్‌రోడ్డులో ఉదయం 10గంటల నుంచి రథోత్సవం ముగిసే వరకు దుకాణ సముదాయాలు మూసివేయాలని అన్నవరం ఎస్.ఐ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలను బైపాస్‌రోడ్డు ద్వారా మళ్లిస్తున్నామన్నారు. విద్యుత్ ప్రమాదాలు సంభవించకుండా ముందుజాగ్రత్త చర్యగా మెయిన్‌రోడ్డులో ఉదయం 10గంటలనుంచి రాత్రి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ అధికారులు ప్రకటించారు.

విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి

- జేఎన్టీయూకే ఉపకులపతి ప్రసాద్
- విశ్వవిద్యాలయ క్రీడాదినోత్సవ వేడుకలు



జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారుడికి సర్టిఫికెట్‌ను అందజేస్తున్న వీసీ ప్రసాద్, రెక్టార్ కేవీ రమణ

జేఎన్టీయూకే, మే 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటూ క్రీడల్లో కూడా రాణించడం ద్వారా వారిలో వ్యక్తిత్వ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని జేఎన్టీయూ కే ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ అన్నారు. వర్సిటీలోని అలూమ్నీ ఆడిటోరియంలో విశ్వవిద్యాలయ క్రీడాదినోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. రెక్టార్ కేవీరమణ అధ్యక్షతన నిర్వహించిన ఈవేడుకలకు విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ గుబిలి శ్యామ్‌కుమార్, ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్స్ కార్యదర్శి డాక్టర్ జీవీరాజు సమన్వయకర్తలుగా వ్యవహరించగా ముఖ్యఅతిథిగా ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ పాల్గొన్నారు. మొదటిగా పాకిస్థాన్‌తో జరుగుతున్న యుద్ధంలో అమరులైన భారతదేశానికి చెందిన వీరజవాన్ల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ ఒక నిమిషంపాటూ మౌనం పాటించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడు తూ మన లక్ష్యాలను చేరుకునేందుకు క్రీడలు ఒక అద్భుతమైన అవకాశమని క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక దృఢత్వానికి, మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చున్నారు. స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ 2024-25 విద్యాసంవత్సరంలో వర్సిటీ తరపున నిర్వహించిన క్రీడల్లో పా ల్గొన్న క్రీడాకారులు, జాతీయస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొన్న క్రీడాకారుల వివరాలతో వార్షిక నివేదికను చదివి వినిపించారు. అనంతరం జేఎన్టీయూకే తరపున జాతీయస్థాయి క్రీడా పోటీ ల్లో పాల్గొన్న క్రీడాకారులకు, విజేతలకు, పీడీలకు, కోచ్‌లకు, మేనేజర్లకు సర్టిఫికెట్లతో పాటూ నగదు బహుమతిని అతిథులు అందజేశారు. మాజీ ఉపకులపతులు, సీనియర్ ప్రొఫెసర్లు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, వర్సిటీ అనుబంధ కళాశాలల పీడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోదావరిలోకి దూకి వ్యక్తి ఆత్మహత్య

- మృతుడు చాగల్లువాసిగా గుర్తింపు

కొవ్వూరు, మే 10(ఆంధ్రజ్యోతి): గోదావరి నదిలోకి దూకి వ్యక్తిఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కొవ్వూరు-రాజమహేంద్రవరం మధ్య గోదావరిపై నిర్మించిన రోడ్డు కంరైలు బ్రిడ్జి 148వ స్తంభంవద్ద చోటుచేసుకుంది. శనివారం ఉదయం 10.30గంటల సమయంలో సుమారు 60 సంవత్సరాల వృద్ధుడు చెప్పులు, షర్ట్ ఉంచి బ్రిడ్జి పైనుంచి గోదావరిలోకి దూకేశాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు చాగల్లుకి చెందిన కొడవ టి సుబ్రహ్మణ్యం (60)గా గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు సీఐ పి.విశ్వం తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

- డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం

జీజీహెచ్(కాకినాడ) మే 10 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ద్వారా ఉన్నతమైన ఫలితాలు సాధించవచ్చని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం పేర్కొన్నారు. కాకినాడ జీజీహెచ్‌లోని ఆర్థోపెడిక్ విభా గ సెమినార్ హాల్లో శనివారం ఆర్థోపెడిక్ విభాగం సమకూర్చిన రూ.2.82లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డ్ ఇంటరాక్టివ్ టీవీని డాక్టర్ నరసింహం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య విద్యార్థులకు సులభంగా పాఠ్యాంశాల బోధనకు దోహదపడుతుందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వైద్య రంగంలో పెనుమార్పులు వస్తున్నాయన్నారు. కాలంతో పోటీపడి అనుకున్న లక్ష్యాలను అధిగమించేందుకు విద్యార్థులకు ఇటువ ంటి టెక్నాలజీని సమకూర్చిన ఆర్థోపెడిక్ విభాగాధిపతి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విఠల్‌ను డీఎంఈ అభినందించారు. డాక్టర్ విఠల్ మాట్లాడుతూ డిజిటల్ బోర్డ్ ఇంటరాక్టివ్ టీవీ ద్వారా అధునాతన విధానంలో వైద్య విద్యార్థులకు బోధనలు నిర్వహిస్తామన్నారు. ముఖ్యంగా శస్త్రచికిత్స విధానం ద్వా రా అవగాహన, అనుభవాలు అందజేయడానికి దోహదపడుతుందన్నారు. ఆపరేషన్ థియేటర్‌ను అనుసంధానం చేసి క్లిష్టమైన, అరుదైన కేసులపై పీజీ విద్యార్థులకు శిక్షణా తరగతులు బోధించడం సులభతరమవుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శశి, డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసన్, జనరల్ మెడిసన్ హెచ్‌వోడీ డాక్టర్ పి.యశోదమ్మ, ఏఆర్‌ఎంవో డాక్టర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంఈ డాక్టర్ నరసింహం

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ప్రమాదంలో మృతిచెందిన నాగబాబు

ముమ్మిడివరం, మే 10(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా 216 జాతీయ రహదారి ముమ్మిడివరం కొండాలమ్మచింత బైపాస్ రోడ్డులో శనివారం ఓ యువకుడు దుర్మరణం చెందాడు. యానాం వైపు నుంచి పల్సర్ మోటారు సైకిల్‌పై వస్తున్న యువకుడిని ముమ్మిడివరం బైపాస్ రోడ్డులో ఎదురుగా వస్తున్న టాటాఏస్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అల్లవరం మండలం కోడూరుపాడు శివారు నక్కలపుంతకు చెందిన నవరపు నాగబాబు (28) ఈ ప్రమాదంలో మృతిచెందాడు. నాగబాబు ధాన్యం పట్టుబడి జట్టులో పనిచేస్తుంటాడు. పది రోజులుగా పి.గన్నవరం మండలం పోతవరంలో ధాన్యం పట్టుబడిలో పనిచేసి శుక్రవారమే ఇంటికి తిరిగి వచ్చాడు. నాగబాబు శనివారం యానాం వెళ్లి తిరిగి వస్తూ ఈ ప్రమాదానికి గురయ్యాడు. మృతుడు నాగబాబుకు భార్య రేణుక, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రేణుక ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉంటుంది. నాగబాబు అత్తవారి ఊరు పి.గన్నవరం మండలం ముంగండపాలెం. ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి తాళాలు పగులకొట్టి బంగారం చోరీ

- రూ.4.50లక్షలు విలువైన బంగారం, వెండి వస్తువుల అపహరణ



పరిశీలిస్తున్న రూరల్ సీఐ విజయ్‌బాబు

కొవ్వూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిఉన్న ఇంటి తలుపులు పగులకొట్టి రూ.4.50 లక్షలు విలువైన బంగారు, వెండి వస్తువులు అపహరించుకుపోయినట్టు కొవ్వూరురూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. మద్దూరు గ్రామానికి చెందిన పుసులూరి కిశోర్ కుమార్ ఇంటికి తాళం వేసి బంధువుల ఇంట్లో జరిగే పెళ్లికి ఈనెల 9వ తేదీన తణుకు వెళ్లాడు. తిరిగి శనివారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. దీంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న సామగ్రి చిందరవందరగా పడి ఉం డడంతో దొంగతనం జరిగినట్టు గుర్తించి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 21 కాసుల బంగారం వస్తువులు, 500 గ్రాముల వెండి దొంగిలించుకుపోయినట్టు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. సమాచారం తెలిసిన వెంటనే క్రైం జిల్లా అడిషనల్ ఎస్పీ అర్జున్, ఇంచార్జి డీఎస్పీ కె.వి.వి.సత్యనారాయణ, రూరల్ సీఐ కె. విజయ్‌బాబు, రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కిశోర్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీరు బాటిళ్లతో వ్యక్తిపై దాడి

- తీవ్ర గాయాలు, అడ్డువచ్చిన కుమార్తెకు గాయాలు



బీరు బాటిళ్లతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన వెంకటరమణ

పిఠాపురం, మే 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలో ఒక వ్యక్తిపై కొందరు యువకులు శనివారం రాత్రి బీరు బాటిళ్లతో విచక్షణారహితంగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. అడ్డువచ్చిన ఆ వ్యక్తి కుమార్తెకు గాయాలయ్యాయి. పట్టణంలోని కత్తులగూడెంలో పెళ్లి సందర్భంగా మనోజ్ అనే యువకుడితో ఉదయకిరణ్ అతని స్నేహితులు గొడవకు దిగారు. దీనిని గమనించిన మనోజ్‌ను అతని తల్లిదండ్రులు దిమ్మిలి వెంకటరమణ, అచ్యుతమ్మలు అక్కడి నుంచి తీసుకుని ఇంటికి వెళ్లిపోయారు. కొంత సమయం తర్వాత ఉదయకిరణ్ తన స్నేహితులతో కలిసి మనోజ్ ఇంటికి వచ్చి మరలా గొడవకు దిగారు. ఈ సమయంలో అడ్డుగా వచ్చిన మనోజ్ తండ్రి వెంకటరమణపై బీరుబాటిళ్లతో విచక్షణారహితంగా దాడిచేసి గాయపరిచారు. అడ్డు వచ్చిన అతని కుమార్తె అయితే దివ్యకు గాయాలయ్యా యి. వీరిని చికిత్స నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వెంకటరమణకు శరీరంపై పలుచోట్ల గాయాలైనట్లు వైద్యులు తెలిపారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రత్నగిరిపై భక్తుడి కారు నుంచి మంటలు



కారు నుంచి మంటలు వస్తున్న, మంటలను ఆర్పుతున్న దృశ్యం

అన్నవరం, మే 10 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధికి విచ్చేసిన భక్తుడి కారు నుంచి శనివారం మంటలు వ్యాపించడంతో పెనుప్రమాదం తప్పిం ది. వివరాల్లోకి వెళితే ధవళేశ్వరం నుంచి నలుగురు కుటుంబ సభ్యులు స్వా మిసన్నిధికి కారులో విచ్చేశారు. కారు సీఆర్వో కార్యాలయంవద్దకు చేరుకోగానే కారు ఇంజన్ నుంచి మంటలు రావడంతో భక్తులు భయభ్రాంతులకు గురయ్యారు. కారునుంచి భక్తులు బయటకు రాగా సెక్యూరిటీ సిబ్బంది ఫైర్ సిలిండర్లు ఉపయోగించి మంటలను అదుపుచేశారు. ఈప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

వాటరు ట్యాంకు నిర్మాణానికి విరాళం

మామిడికుదురు, మే 10(ఆంధ్రజ్యోతి): మొగలికుదురులోని కేవీఎల్పీ జడ్పీ హైస్కూలులో వాటరు ట్యాంకు నిర్మాణం కోసం 2003-04లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు రూ.10వేలు విరాళంగా అందించారు. శనివారం విరాళాన్ని స్కూలు యాజమాన్యానికి అందించారు. పూర్వ విద్యార్థులను పలువురు కొనియాడారు.

శివాలయాల్లో శని త్రయోదశి పూజలు

అల్లవరం, మే 10(ఆంధ్రజ్యోతి): పురాణ ప్రసిద్ధి పొందిన రామేశ్వరం, లక్ష్మణేశ్వరం శివాలయాలతో పాటు పలు ఆలయాల్లో శని త్రయోదశి సందర్భంగా అభిషేకాలు, పూజలు జరిగాయి. కొమరగిరిపట్నం, గోడి, బోడసకుర్రు, అల్లవరం,దేవగుప్తం, గోడిలంక తదితర గ్రామాల్లోని శివాలయాల్లో అభిషేకాలు, శనిత్రయోదశి పూజలు నిర్వహించారు.

భారత సైనికులకు మద్దతుగా ర్యాలీ, పూజలు

ముమ్మిడివరం, మే 10(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ ఉగ్రవాదుల దాడికి ప్రతిస్పందనగా భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలని భారత సైనికులు, ప్రజలు సురక్షితంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ముమ్మిడివరం నగర పంచాయతీ సోమిదేవరపాలెంలో శనివారం ర్యాలీ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగర పంచాయతీ 9వ వార్డు కౌన్సిలర్ అడపాల సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు బ్యానర్ చేతబట్టి భారత సైనికులకు మద్దతుగా పాకిస్థాన్ చర్యలను నిరసిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని శ్రీకృష్ణుడి ఆలయంలో భారత సైనికులు, ప్రజలు సురక్షితంగా ఉండాలని పూజలు చేశారు. సింధూర్ విజయవంతం కావాలని భారత సైనికులకు మనోధైర్యాన్ని మరింత పెంచాలని వారు ఆకాంక్షించారు. గ్రామంలో బ్యానర్లు చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. శత్రు సైన్యంతో పోరాడుతున్న సైనికులకు సంఘీభావం తెలిపారు. అనంతరం పాకిస్థాన్‌తో జరుగుతున్న యుద్ధంలో వీర మరణం పొంది మురళీనాయక్‌కు సంతాపం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో కముజు ప్రతాప్, లోకినీడి బాలయ్య, శాగా చింతారావు, తానింకి శ్రీనివాస్, అయినాపురపు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లి, (ఆంధ్రజ్యోతి): దేశ భద్రత కోసం జరుగుతున్న ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలని బీజేపీ ఆధ్వర్యంలో శనివారం అయినవిల్లి శ్రీసిద్ధివినాయక స్వామివారి ఆలయంలో పూజలు నిర్వహించారు. పహల్గాంలో పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదుల దాడికి ప్రతిస్పందనగా భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలని, భారత ప్రజలు, సైనికులు సురక్షితంగా ఉండాలని పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కుడుపూడి చంద్రశేఖర్, పి.గన్నవరం నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ చీకురుమిల్లి వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి వెంకటేశ్వరరావు చెరుకూరి గోపాలకృష్ణ, కొపనాతి శ్రీరామచంద్రమూర్తి, ఆకుమర్తి బేబిరాణి తదితరులు పాల్గొన్నారు.





అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయంలో పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

మామిడికుదురు: బాలబాలాజీ ఆలయంలో పూజలు జరిపిస్తున్న బీజేపీ నాయకులు

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): భారత్-పాకిస్థాన్‌ల ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత సైనికుల భద్రత కోరుతూ అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానంలో బీజేపీ నాయకులు శనివారం పూజలు జరిపించారు. సైనికులకు దేశ ప్రజల సంఘీభావంతో పాటు భగవంతుడి శక్తి తోడే ఉండాలన్నారు. జాతీయ పతాకాన్ని చేతబట్టి భారత మాతకు జేజేలు కొడుతూ పూజలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా, జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, మండలశాఖ అధ్యక్షుడు భైరిశెట్టి దుర్గారామకృష్ణ, మెండా ఆదినారాయణ, నాయకులు కంకిపాటి సుబ్బారావు, పసుపులేటి మహాలక్ష్మి, కోటిపల్లి సాయిబాబు, గాడి సత్తిబాబు, కటికిరెడ్డి గంగాధరం పాల్గొన్నారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామివారి ఆలయంలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, త్రివిధ దళాల కోసం ప్రత్యేక పూజలు నిర్వహించినట్టు బీజేపీ నాయకులు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ మాట్లాడుతూ తీవ్రవాదులందరినీ అంతమొందించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం విజయవంతం అవ్వాలని స్వామివారిని కోరుకుమన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పోతురాజు సురేష్, జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్, రాష్ట్ర కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు, ఉద్దరాజు రామకృష్ణంరాజు, బోనం నాయుడు, పోతురాజు నాగరాజు, యెనుముల సుబ్బారావు, యెనుముల గణపతి, కాళ్లకూరి సతీష్‌పాల్గొన్నారు.

పీవీరావు ఆశయ సాధనకు యువత కృషిచేయాలి

- స్వగ్రామం దేవగుప్తం, జిల్లాలో పీవీ రావు జయంతి వేడుకలు

అల్లవరం, మే 10(ఆంధ్రజ్యోతి): మాలల హక్కుల సాధన కోసం చివరి వరకు పోరాడిన మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ రావు ఆశయ సాధనకు యువత కృషి చేయాలని వక్తలు ప్రసంగించారు. దేవగుప్తం స్వగ్రామంలో పీవీ రావు చిత్రపటానికి నాయకులు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన సోదరుడు పోతుల నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, సర్పంచ్ సాధనాల వెంకట్రావు, తిక్కా వెంకటప్రసాద్, వేగిరాజు వెంకట్రాజు, కడలి వెంకటేశ్వరరావు, గుబ్బల నాగేశ్వరరావు, డాక్టర్ బుజ్జి, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, కాశి బాలయోగి, ముత్తాబత్తుల రాంబాబు పాల్గొన్నారు. బోడసకుర్రు కంసాలమామిడి వద్ద జరిగిన పీవీరావు జయంతి వేడుకల్లో సాపే ధర్మరాజు, రొక్కాల నాగేశ్వరరావు, మోసుగంటి దుర్గారావు, బొంతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ పోలమ్మచెరువుగట్టున జైబుద్ధ పార్కులో బుద్ధుని విగ్రహం వద్ద పీవీ రావు జయంతిని ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ, అభ్యుదయ సంఘాల ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దోనిపాటి ఆంజనేయులు, కాశి బాబుజగ్జీవన్‌రామ్, కాశి సింహాద్రివర్మ, బొజ్జా బాలకృష్ణ, దాసరి రాము, ముడే వెంకట్రావు, వడ్డి త్రిమూర్తులుతో పాటు పలువురు పీవీరావు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించి ఆయన అందించిన సేవలు కొనియాడారు. అలాగే మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ రావు జయంతిని అనాతవరంలో శనివారం ఘనంగా నిర్వహించారు. అనాతవరంలోని పీవీ రావు ఘాట్ వద్ద స్వర్గీయ పీవీరావు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ పీవీరావు అందించిన సేవలను పలువురు కొనియాడారు. మాలల అభ్యున్నతికి, ఐక్యతకు ఆయన చేసిన పోరాటాన్ని పలువురు అభినందించారు. మే 12న కాకినాడలో జరిగే మహారణభేరి సభను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. మహారణభేరి సభకు ప్రతీ ఇంటి నుంచి ఒకరు లేదా ఇద్దరు స్వచ్ఛందంగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మిమ్మితి చిరంజీవి, పెయ్యల పరశురాముడు, నక్కా సర్వేశ్వరరావు, ఎంపీకే బీమారావు, జల్లి శ్రీనివాసరావు, నాతి శ్రీనివాసరావు, రొక్కాల నాగేశ్వరరావు, పెట్టా ఈశ్వరదత్, మెండి డేవిడ్ అంబేద్కర్ వాకపల్లి హరీష్, రేవు ప్రతాప్, యలమంచిలి బాలరాజు, పెయ్యల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



అల్లవరం: దేవగుప్తంలో మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీరావుకు నివాళి

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): మాలమహానాడు అధ్యక్షుడు దివంగత నేత పీవీ రావు జయంతిని పి.గన్నవరం అక్విడెక్టు వద్ద స్థానిక నాయకులు ఘనంగా నిర్వహించారు. పీవీ రావు చేసిన ఉద్యమాలను కొనియాడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అడ్డగళ్ల వెంకటసాయిరామ్, మాలమహా నాడు మండల అధ్యక్షుడు యన్నపు పెద్ద, నూకపెయ్యి రాజేంద్ర ప్రసాద్, గెడ్డం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ పీవీ రావు జయంతి వేడుకలను అంబాజీపేట బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండల మాల మహానాడు అధ్యక్షుడు నాగవరపు నాగరాజు ఆధ్వర్యంలో పీవీ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులుర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ జల్లి బాలరాజు, ముత్తాబత్తుల ప్రశాంత్, నెల్లి వెంకటరమణ, నూకపెయ్యి చిన్న, కత్తుల బాబులు, చింతపల్లి వెంకటేశ్వరరావు, గోసంగి సత్యనారాయణ, కోట హనుమంతరావు, నాగబత్తుల నరసింహం పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, మాల మహానాడు వ్యవస్థాపకుడు పీవీ రావు జయంత్యుత్సవాల సందర్భంగా శనివారం చల్లపల్లిలో జరిగిన కార్యక్రమాల్లో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పాల్గొన్నారు. అంబేద్కర్, పీవీ రావు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు నిమ్మకాయల చెల్లయ్యనాయుడు, గొలకోటి చిన్నా, బూసి బుజ్జిదొర, పోలిశెట్టి శివాజీ, దంగేటి రవీంద్రనాద్, కాట్రు ఆనందరావు, సుంకర రాంబాబు, దెందుకూరి సత్తిబాబు రాజు, సుంకర చిన్నబ్బాయి, కుసుమే వెంకన్న తదితరులు పాల్గొన్నారు. కాగా ఎస్.కొత్తపల్లిలో బొడ్డు బుజ్జి అధక్షతన జరిగిన కార్యక్రమాల్లో సర్పంచ్‌లు కుంచే చిట్టికుమారిచిన్ని, నల్లా బాబండి, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, వైసీపీ ఇన్‌చార్జి పినిపే శ్రీకాంత్, నడింపల్లి వాసు, కె.పెద్దిరాజు, మోటూరి సత్యంకాపు, కొంకి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీరావు జయంతిని శనివారం మామిడికుదురులో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటం ఏర్పాటుచేసి పూలమాలలువేసి నివాళులర్పించారు. మాలల అభ్యున్నతికి ఆయన చేసిన ఎనలేని కృషిని, పోరాటాన్ని కొనియాడారు. ఎంపీటీసీ నెల్లి దుర్గాప్రసాద్, మాలమహానాడు నాయకులు, అంబేడ్కర్ యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పరిజ్ఞానం పెంపొందించేందుకు శిక్షణ దోహదం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించిన దృశ్యం

ముమ్మిడివరం, మే 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో కనీస విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు వేసవి ప్రత్యేక శిక్షణా తరగతులు ఎంతో దోహద పడతాయని జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణా కార్యదర్శి బి.హనుమంతరావు పేర్కొన్నారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు గత నెల 24 నుంచి ముమ్మిడివరం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి ప్రత్యేక శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయి. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో హనుమంతరావు మాట్లాడుతూ వేసవి సెలవులు వృథా కాకుండా రానున్న తరగతులకు సంబంధించి విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఇవి ఎంతో ఉపయోగపడతాయన్నారు. 8, 9, 10 తరగతులకు సంబంధించి తెలుగు, హిందీ, ఇంగ్లీషు, మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లో విద్యార్థులకు కనీస పరిజ్ఞానాన్ని అవగాహన కల్పించారు. 15 రోజుల పాటు శిక్షణకు హాజరై విషయ పరిజ్ఞానం పెంపొందించుకున్న విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపి సర్టిఫికెట్లు అందించారు. ఈనెలలో ఉద్యోగ విరమణ చేయనున్న తెలుగు ఉపాధ్యాయుడు పచ్చిమాల శివనాగరాజుకు పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. శిక్షణ తరగతుల నిర్వహణకు కృషిచేసిన కోఆర్డినేటర్లు గోపాలకృష్ణ, గోడి శ్రీనివాస్‌లను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్గారావు, సూర్యనారాయణ, బ్రెస్సింగ్టన్, రమేష్, అర్జునరావు, హిమబిందు, భవానీలతో పాటు పలువురు పాల్గొన్నారు.

జనసేన కార్యకర్తలకు మంచి గుర్తింపు

మలికిపురం, మే 10(ఆంధ్రజ్యోతి): జనసేనలో పనిచేసే ప్రతీ కార్యకర్తకు ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో క్రియాశీల కార్యకర్తలకు సభ్యత్వ కిట్లు అందజేశారు. నియోజకవర్గంలో 20వేలు దాటి సభ్యత్వాలు నమోదు చేయడంలో కార్యకర్తల కృషి మరువలేమన్నారు. ప్రతీకార్యకర్తకు రూ.5 లక్షలు ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. దిరిశాల బాలాజీ, సూరిశెట్టి శ్రీనివాస్, ఎంవీ సత్యవాణి, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, ఎం.సత్తిబాబు, గుబ్బల ఫణి, ఉండపల్లి అంజి పాల్గొన్నారు.

రేషన్ కార్డుల మార్పుకు కమిటీ

యానాం, మే 10(ఆంధ్రజ్యోతి): యానాం పరిధి పసుపురంగు రేషన్ కార్డు(ఏపీఎల్)లను ఎరుపురంగు రేషన్‌కార్డు(బీపీఎల్)లుగా మార్చుకునేందుకు దరఖాస్తులు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించేందుకు ప్రత్యేక కమిటీ నియమించారు. ఈకమిటీ సభ్యులు ఇంటింటికి వెళ్లి పరిశీలన చేస్తారు.

సైనికుడు, రైతుకు సెల్యూట్ చేయాల్సిందే

- ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ర్యాలీ



ర్యాలీలో మాట్లాడుతున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం, మే 10(ఆంధ్రజ్యోతి): దేశంలో సైనికుడు, రైతుకు ఎప్పుడు సెల్యూట్ చేయాల్సిందేనని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. పహల్గాంలో అమాయకులైన భారతీయులపై దాడిచేసిన పాకిస్తాన్ ఉగ్రవాదులపై భాతర ప్రభుత్వం చేస్తున్న ఆపరేషన్ సింధూర్‌కు మల్లాడి అభిమాన సంఘం ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడామైదానం నుంచి ర్యాలీ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఢిల్లీ ప్రతినిధి మల్లాడి మాట్లాడుతూ దేశంలో సైనికుడు, రైతు లేకుంటే మనం లేమన్నారు. జాతీయ జెండాలతో భారత్ మాతాకీ జై అంటూ నినాదాలతో ర్యాలీ జరిగింది. ర్యాలీలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ పెండెం సూర్యప్రకాష్, ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్, విశ్రాంత సీఐ గూటం శివగణేష్, ప్రజలు, ప్రముఖులు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిదులు పాల్గొన్నారు.

గొల్లపాలెం, అంతర్వేదిలో మాక్ డ్రిల్



గొల్లపాలెంలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు, ఓఎన్జీసీ సిబ్బంది, ఎస్పీఎఫ్ సిబ్బంది

మలికిపురం, మే 10(ఆంధ్రజ్యోతి): భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధ వాతావరణం, ఉద్రిక్త పరిస్థితుల కారణంగా తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయడానికి అంతర్వేది మెరైన్ పోలీసు ఆధ్వర్యంలో మలికిపురం మండలం గొల్లపాలెంలో ఓఎన్జీసీ, మలికిపురం పోలీసులు, ఎస్పీఎఫ్ బలగాలతో కలిసి మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రజలను అప్రమత్తంచేసి అవగాహన కల్పించారు. యుద్ధ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో అంతర్వేది మెరైన్ ఇనస్పెక్టర్ నవీన్ నరసింహమూర్తి, ఎస్ఐ నాగార్జున, మలికిపురం ఎస్ఐ సురేష్, ఎస్పీఎఫ్ సీఐ, గ్రామ సర్పంచ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం అంతర్వేది పరిసర ప్రాంతాల్లో మెరైన్ సీఐ నవీన్‌నరసింహమూర్తి ఆధ్వర్యంలో శనివారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. అంతర్వేది మత్స్యకారుల గ్రామాల్లో అపరిచుతులెవరైనా ప్రవేశించినా, విపత్కర పరిస్థితులు సంభవిస్తే ఎటువంటి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలో కళ్లకు కట్టినట్టు పోలీసులు ప్రజలకు చూపించారు. సముద్ర తీర ప్రాంతంలో గస్తీ చర్యలు చేపట్టి మాక్‌డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐలు సోమశేఖర్‌రెడ్డి, నాగార్జునరాజు, కె.దుర్గాశ్రీనివాస్, పి.సురేష్, మెరైన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్కిల్స్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట, మే 10(ఆంధ్రజ్యోతి): వేసవిలో విద్యార్థులకు అందిస్తున్న కమ్యూనికేషన్ స్కిల్స్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో మోకా ప్రకాష్ అన్నారు. అంబాజీపేట జడ్పీ హైస్కూల్‌లో వినాయక యాడ్స్ అధినేత బొక్కా వినాయకరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. 30రోజులు శిక్షణ అందిస్తామన్నారు. ఉపాధ్యాయులు, నిర్వహకులు పాల్గొన్నారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి: ఎమ్మెల్యే

- ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అంతర్వేది, మే 10(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లిలంక గ్రామంలో లేసు భవనంలో ఆంధ్రప్రదేశ్ బీసీ ఫైనాన్స్ బీసీ కార్పొరేషన్, ఈడబ్ల్యుఎస్‌శాఖ సహకారంతో మండలస్థాయి ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లంక గ్రామంలో లేసు భవనంలో 135మంది మహిళలను ఎంపికచేసి ఉచిత కుట్టు శిక్షణ ఇస్తారన్నారు. గృహిణులు కుట్లు, అల్లికలు నేర్చుకుని ఆదాయాన్ని సమకూర్చుకుని వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, మహిళా సంఘాలు, నాయకులు పాల్గొన్నారు.

ఈదరపల్లి వద్ద వంతెన నిర్మాణానికి ఏర్పాట్లు

- పరిశీలించిన ఎమ్మెల్యే ఆనందరావు



వంతెన నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, అముడాఛైర్మన్ స్వామినాయుడు, టీడీపీనేత రమణబాబు

అమలాపురం, మే 10(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణంలోని ట్రాఫిక్ సమస్యను నివారించే క్రమంలో భాగంగా ఈదరపల్లి వద్ద మరో వంతెన నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా శనివారం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబులు వంతెన నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. త్వరలో శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను వారు పరిశీలించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణల తొలగింపు ప్రక్రియను కూడా వారు పరిశీలించారు. కాల్వలకు నీటిని విడుదలచేసే సమయంలోగానే వంతెన నిర్మాణ బేస్‌మెంట్ పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే ఆనందరావు ఆదేశించారు.

అనధికార మద్యం విక్రయాలపై 34మందిపై కేసులు

అమలాపురం, మే 10(ఆంధ్రజ్యోతి): అమలాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఐదు మండలాల్లో ఈనెల1నుంచి 10వరకు 34 మంది అనధికార మద్యం షాపుల నిర్వాహకులపై కేసులు నమోదుచేసినట్టు సీఐ సత్యనారాయణ తెలిపారు. ఒక స్కూటీని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సుంకం చెల్లించని కేసులు (డీపీఎల్)34, ఎన్డీపీఎల్ కేసులు 2నమోదు చేసినట్టు తెలిపారు. సుంకం చెల్లించిన మద్యం 44లీటర్లు, చెల్లించని మద్యం 20.742లీటర్లగా తెలిపారు. వివిధ కేసుల్లో పాత ముద్దాయిలైన 130మందిని ఇప్పటివరకు తహశీల్దార్ల వద్ద బైండోవర్ చేశామని, ఒకరి నుంచి రూ.15వేలు జరిమానా వసూలు చేశామన్నారు.మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్టు సీఐ తెలిపారు.

డీఎస్సీలో ఉర్దూ పోస్టులు భర్తీ చేయాలి

పి.గన్నవరం, మే 10(ఆంధ్రజ్యోతి): డీఎస్సీలో ఉర్దూ పోస్టులు (ఎస్‌జీటీ ఎస్ఏ పోస్టులు) భర్తీ చేయాలని కోరుతూ శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు ఉర్దూ అభ్యర్థులు, స్థానిక నాయకులతో కలిసి వినతిపత్రం అందించారు. ఏడేళ్లగా డీఎస్సీలో ఉర్దూ పోస్టులకు కోచింగ్ తీసుకుంటున్నామని వివరించారు. ప్రస్తుత డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఉర్దూకు ఒక పోస్టు కూడా ప్రకటించలేదన్నారు. ఈవిషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యేను అభ్యర్థిం చారు. వినతిపత్రం అందించిన వారిలో వక్ఫ్‌బోర్డు మెంబరు హాజీ ముకరం హుస్సేన్, మైనార్టీ సెల్ కోనసీమ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ ఎంఏ సుభాన్, షానవాజ్ హుస్సేన్ మజీంద్రాని, షబ్బీర్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

ఆలయ భూముల్లో అక్రమ కట్టడం కూల్చివేత

అంతర్వేది, మే 10(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చెందిన అంతర్వేది దేవస్థానం గ్రామంలో 991/2 సర్వే నంబరులో గల భూమిలో అనధికారికంగా నిర్మాణం చేపట్టడాన్ని గమనించి శనివారం రెవెన్యూ, పోలీసుల సహకారంతో ఆలయ అధికారుల నిర్మాణాన్ని తొలగించారు. స్వామివారి ఆలయ భూమిలో అక్రమ కట్టడాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తనిఖీ అధికారి రామలింగేశ్వరరావు, కార్యనిర్వహణాధికారి ఎస్.ప్రసాద్‌రాజు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


వైభవంగా రాజగోపాలస్వామి తిరు కల్యాణ మహోత్సవాలు

పి.గన్నవరం, మే 10(ఆంధ్రజ్యోతి): లంకలగన్నవరంలో వేంచేసి ఉన్న శ్రీరుక్మిణీ సత్యభామా సమేత శ్రీరాజగోపాలస్వామి వారి వైశాఖమాస పాంచాహ్నిక దివ్య తిరు కల్యాణ మహోత్సవాలు మూడు రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి మిర్తిపాటి వారి సేవా కార్యక్రమం వైభవంగా జరిపించారు. భక్తులకు విసిన కర్రలు, ప్రసాదం, మహిళలకు రవికల గుడ్డలు అందించారు. అలాగే నిత్య పూజకు ఉపయోగించే స్తోత్ర రత్నావళి పుస్తకాలను పంపిణీ చేశారు. భక్తులకు ఆలయ ప్రధాన అర్చకులు ఖండవల్లి అనంతాచార్యులు, నారాయణ అచార్యులు మహదాశీర్వాచనం చేసి స్వామివారికి శేష వస్త్రాలను అందజేశారు.

నేడు నృసింహ జయంతి

అంతర్వేది, మే 10(ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి నృసింహ జయంతిని పురస్కరించుకుని ఆలయంలో ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. 365వైఖానస సంప్రదాయానుసారం ప్రకారం స్వామివారి జన్మ నక్షత్ర పూజల్లో భాగంగా నృసింహ జయంతి రోజుమాత్రమే స్వామివారికి సాయంత్రం సమయంలో పంచామృతాలతో అభిషేకం నిర్వహిస్తారు. పగలు కాదు, రాత్రి కాదు సూర్యాస్త సమయంలో జన్మించిన లక్ష్మీ నరసింహస్వామి జన్మ ఘడియలను జయంతిగా పురాణాలు చెబుతున్నాయని అర్చకులు తెలిపారు. స్వామివారి జన్మ నక్షత్ర పూజలతో పాటు అష్టోత్తర కలశాభిషేకాన్ని అర్చకులు నిర్వహిస్తారు. ఉదయం అభిషేకాలు, సుదర్శన హోమం, దీక్షా విరమణ, సాయంత్రం జరిగే అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహిస్తారు. 27రోజులు భక్తి శ్రద్ధలతో మాలధారణ ధరించిన కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల భక్తులు నృసింహ జయంతి సందర్భంగా మాల విరమణ పూజా కార్యక్రమం జరగనుంది. ఆదివారం ఉదయం ఆలయ కల్యాణ మండపం వద్ద మాలధరించిన నృసింహ భక్తులు ఇరుముడి సమర్పించి, ప్రత్యేక హోమాలు, అభిషేకాలు, పూర్ణాహుతి నిర్వహిస్తారు.

ప్రధాని మోదీ సాహసోపేత చర్య: నాగిడి



కాట్రేనికోన, మే 10(ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లో భారత త్రివిధ దళాలు నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ ఒక సాహసోపేత చర్యగా నిలిచిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు అన్నారు. శనివారం కాట్రేనికోనలో ఆయన స్వగృహంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పహల్గాంలో కాల్పులు జరిపి 26మంది మరణానికి కారకులైన ఉగ్రవాదులను పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో జరిపిన ఆపరేషన్‌లో త్రివిధ దళాలు దాడిచేసి జైషే ఉగ్రవాద సంస్థ ప్రధాన కార్యాలయాన్ని, శిబిరాలను ధ్వంసం చేశారన్నారు. ఉగ్రవాదులను మట్టుబెట్టడంలో భారతదేశం ఎంత కఠినంగా వ్యవహరిస్తుందో ప్రపంచ దేశాలకు మరో సారి తెలిసివచ్చిందన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ చర్యలకు ప్రపంచ దేశాలు మద్దతు పలుకుతున్నాయన్నారు.

అంతర్వేది ఆలయంలో తనిఖీ



అంతర్వేది, మే 10(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు శనివారం బాంబ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. భారత్-పాక్ యుద్ధ వాతావరణం దృష్ట్యా జిల్లా బాంబ్ స్క్వాడ్ బృందం స్థానిక ఎస్ఐ కె.దుర్గాశ్రీనివాస్ నేతృత్వంలో దేవాలయానికి సంబంధించిన వాహనశాల, అన్నదానం, భక్తుల క్యూలైన్, ఆలయ పరిసరాల్లో తనిఖీలు చేసి భక్తులకు అవగాహన కల్పించారు.

హనుమంత వాహనంపై స్వామివారి గ్రామోత్సవం



అమలాపురం రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): అమలాపురం మండలం బండారులంక గ్రామంలో వేంచేసి ఉన్న పద్మావతి అలివేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామివారి తీర్థ కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం హనుమంతుని వాహనంపై స్వామి, అమ్మవార్లను పురవీధుల్లో మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. గోవింద నామస్మరణల మధ్య అత్యంత వైభవంగా హనుమంత వాహన సేవ జరిగింది. ఇంటింటికీ వెళ్లి కల్యాణ ఆహ్వాన పిలుపును చేపట్టారు. బిళ్లవారి వీధి నుంచి ప్రారంభమై ఎగ్జిబిషన్ స్ట్రీట్ మీదుగా వీరభద్రపురం వరకు స్వామివారి ఊరేగింపు సాగింది. కాశిన ప్రసాద్-కేదారేశ్వరి దంపతులతో స్వామి-అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. శ్రీశ్రీనివాసా బాలమిత్ర సంఘం ప్రతినిదులు చింతపట్ల బాబు, బళ్ల సత్తిరాజు, పిల్లి పల్లపరాజు, బాసిన కల్యాణ్‌కుమార్, కొండా రవి పాల్గొన్నారు.

మహిళలకు ఉపాధి అవకాశాలు పెంపొందిస్తాం

మలికిపురం, మే 10(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో అన్నివర్గాలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. లక్కవరంలో లేసు భవనంలో ఏపీ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని శనివారం ఎమ్మెల్యే దేవ ప్రారంభించారు. 162మంది మహిళలకు 90రోజులు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈశిక్షణ కేంద్రాల ద్వారా విభిన్న మోడళ్లలో శిక్షణ పొంది జీవన ప్రమాణాలను మెరుగు పరుచుకోవాలన్నారు.

శ్రీవిఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు విరాళం

అయినవిల్లి, మే 10(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయక స్వామిని శనివారం ముంబయికి చెందిన దోనెపూడి జగదీష్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అన్నప్రసాద టస్టుకు రూ.లక్ష విరాళం అందజేశారు. వీరికి ఆలయ ప్రధానార్చకులు వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. దాతను ఈవో ముదునూరి సత్యనారాయణరాజు అభినందించారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనం అనంతరం నిత్యాన్నదాన పథకానికి విశాఖపట్నానికి చెందిన ఇమ్మంది శ్రీనివాసరావు-పద్మలత దంపతులు రూ.లక్ష విరాళాన్ని అందించారు. దాతకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

అడుగడుగునా ట్రాఫిక్ జామ్



గొల్లవిల్లి ఆర్అండ్‌బీరహదారిపై ఓఎన్జీసీ భారీ వాహనాల రాకతో ట్రాఫిక్ జామ్ అయిన దృశ్యం

ఉప్పలగుప్తం, మే 10(ఆంధ్రజ్యోతి): ఓఎన్జీసీ భారీ వాహనాల రాకపోకలతో నాలుగు రోజులుగా సిరిపల్లి-మునిపల్లి ఆర్అండ్‌బీ రహదారిపై అడుగడుగునా ట్రాఫిక్ జామ్‌తో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శనివారం ముమ్మిడివరం మండలం అనాతవరం సెంటర్ నుంచి ఉప్పలగుప్తం వరకు అడుగడుగునా ట్రాఫిక్‌కు అంతరాయం కల్గింది. పది భారీ వాహనాలు ఒకే సారి రావడంతో ఇబ్బందులు తలెత్తాయి. మార్గంలో విద్యుత్ వైర్లు వాహనాలకు తగలకుండా చేపడుతున్న చర్యలతో వాహనాల కదలికలకు ఎక్కువ టైమ్ తీసుకుంటోంది. రహదారి మలుపుల్లో పొడవైన వాహనాలు తిరిగేందుకు ఎక్కువ సమయం పడుతోంది. ఈసమయంలో పలు ఆటోలు, చిన్నకార్లు, ఇతర ప్రైవేటు వాహనాలు గంటల తరబడి నిలిచిపోయి ప్రయాణికులు సమయానికి గమ్యం చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈవాహనాల కారణంగా విద్యుత్ హౌస్ కనెక్షన్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా లేక పలువురు ఆందోళన చెందుతున్నారు.

కొత్తలంకలో ప్రత్యేక శిబిరం

ముమ్మిడివరం, మే 10(ఆంధ్రజ్యోతి): కొత్తలంకలోని అనంతలక్ష్మీ సత్యవతి సమేత శ్రీవివేక సత్యనారాయణస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి సదస్యం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులుఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు.

ఘనంగా శ్రీషిర్డిసాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ పూజలు

అంబాజీపేట, మే 10(ఆంధ్రజ్యోతి): గంగలకుర్రులో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీషిర్డిసాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ పూజలు శనివారం ఘనంగా నిర్వహించారు. నేదునూరి వెంకటేశ్వరరావు- సీతామహాలక్ష్మి, నేదునూరి నాగేశ్వరరావు- వెంకటరమణి ఆధ్వర్యంలో బాబా ఆలయంలో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం బాబా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.




ర్యాలి సత్యనారాయణస్వామికి సదస్యం నిర్వహిస్తున్న పండితులు. పక్క చిత్రంలో ర్యాలి ఉమాకమండలేశ్వరస్వామికి సదస్యం జరుపుతున్న పండితులు

వైభవంగా స్వామివార్లకు సదస్యం

ఆత్రేయపురం, మే 10(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఉపాలయంలో ఉన్న శ్రీరమాసత్యనారాయణస్వామి దివ్య కల్యాణోత్సవంలో భాగంగా శనివారం స్వామివారికి నిత్యార్చన, అమ్మవారికి కుంకుమ పూజ, సాయంత్రం నిత్య ఉపాసన, బలిహరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి సదస్యం కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. ర్యాలి ఉమా కమండలేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం శివుడికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన అనంతరం రాత్రి మహదాశీర్వచనం, నీరాజన మంత్ర పుష్పం తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఆయా ఆలయాల్లో భక్తజనం పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి బీహెచ్‌వీ రమణమూర్తి ఏర్పాట్లు నిర్వహించారు.



కె.గంగవరంలో జనసేన సభ్యత్వ కిట్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం

జనసేన సభ్యత్వ కిట్లు పంపిణీ

కె.గంగవరం, మే 10(ఆంధ్రజ్యోతి): కె.గంగవరం మండలంలో జనసేన పార్టీ సభ్యత్వం నమోదు చేసుకున్న వారికి కిట్ల పంపిణీని వేగవంతం చేస్తున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు చిర్రా రాజ్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన కె.గంగవరం, కూళ్ల, తమ్మయ్యపాలెం, కోటిపల్లి, మల్లవరం గ్రామాల్లో క్రియాశీల సభ్యత్వ నమోదు చేసుకున్న వారికి ఇన్సూరెన్స్‌కు సంబంధించిన వివరాలతో కూడిన ఐడెంటీ కార్డులు, ఇతర సామాగ్రితో ఉన్న కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు తాడాల జానకీరామ్, దేవరపల్లి చక్రి, సలాది రామ్‌ప్రసాద్, దాకరపు బన్నీ తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య పంటల సాగులో విత్తన ఎంపిక కీలకం



చొప్పెల్లలో వాణిజ్య రైతులకు అవగాహన కల్పిస్తున్న విత్తన సంస్థల ప్రతినిధులు

ఆలమూరు, మే 10(ఆంధ్రజ్యోతి): వాణిజ్య పంటల సాగులో ముఖ్యంగా కూరగాయలు సాగు చేసే రైతులు మేలు రకమైన విత్తనాన్ని ఎంపిక చేసుకోవడమే కీలకమని పలువురు సూచించారు. చొప్పెల్లలో శనివారం అడ్వాంటా గోల్డెన్ సీడ్స్ కంపెనీ అధ్వర్యంలో రైతులకు కూరగాయల సాగు పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసంస్థ ప్రతినిధులు రాజ్‌కుమార్, పి.సత్యవరప్రసాద్ రైతులకు విత్తన ఎంపికపై అవగాహన కల్పించారు. కూరగాయల పంట భూములను పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు, రైతుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



శనేశ్వర ఆలయంలో శనిత్రయోదశి సందర్భంగా పూజలు చేస్తున్న భక్తులు

శనేశ్వరస్వామి ఆలయంలో పోటెత్తిన భక్తులు

స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.21.72 లక్షలు

కొత్తపేట, మే 10(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి ఆలయానికి శనిత్రయోదశి సందర్భంగా శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు బారులుతీరారు. ఆలయ ప్రాంగణంలో పలువురు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సీనియర్ ఐఏఎస్ అధికారి ఎస్.సత్యనారాయణ, ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ బి.సత్యనారాయణ స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను అందించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.21,72,170 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



రావులపాలెం జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు ధృవపత్రాలు అందచేస్తున్న డీఈవో షేక్ సలీంబాషా

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు

రావులపాలెం, మే 10(ఆంధ్రజ్యోతి): రావులపాలెం జడ్పీ బాలికల పాఠశాలలో గతనెల 24వ తేదీ నుంచి నిర్వహించిన వేసవి శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. విద్యార్థులకు విద్య నైపుణ్యాలు పెంపొందించేందుకు శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. ముగింపు కార్యక్రమంలో డీఈవో షేక్ సలీం బాషా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు ధృవపత్రాలను అందచేశారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, ఏ.వెంకటేశ్వరరావు, ఎంఈవోలు ఆర్.నాగకుమార్, శ్రీనివాసరాజు, బి.అప్పాజీ, హెచ్ఎంలు సువర్ణకుమారి, ఎం.జానకీదేవి తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానం పెంపునకు వేసవిబడి దోహదం

కొత్తపేట, మే 10(ఆంధ్రజ్యోతి): వేసవి బడి ద్వారా విద్యార్థులకు రేపటి తరగతికి కావల్సిన విజ్ఞానం అందుతుందని డీఈవో షేక్ సలీం బాషా పేర్కొన్నారు. శనివారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో వేసవిబడి ముగింపు శిక్షణ తరగతులకు ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 24 నుంచి మే 10 వరకు జరిగిన వేసవిబడి శిక్షణలో విద్యార్థులకు అవసరమైన ఆటలు, పాటలతో పాటు చిత్రలేఖనం, కళలు వంటి వాటికి ప్రాధాన్యం ఇస్తూ శిక్షణ ముగించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఎం.హరిప్రసాద్, కె.లీలావతి, హెచ్ఎం సత్యనారాయణ, కోఆర్డినేటర్ బి.నారాయణరావు, విద్యా కమిటీ చైర్మన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో సలీంబాషా



ప్రత్యేక అలంకరణలోనున్న స్వామివారు

ఘనంగా సదస్యం

కపిలేశ్వరపురం, మే 10 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం ఏటిగట్టు సమీపంలోనున్న దుర్గాసమేత పాపవినాశేశ్వరస్వామి, పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి వార్ల కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం సదస్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కాలదరి ఉమామహేశ్వరరావు, కార్తికేయశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి నిత్య హోమాలు, ఆలయ బలిహరణ, అనంతరం సదస్యం వేడుకను శాస్త్రోక్తంగా జరిపారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.



రావులపాలెంలో పూర్ణాలంకరణలో ఉన్న ఆకులమ్మ అమ్మవారు

ఆకులమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తి

రావులపాలెం, మే 10(ఆంధ్రజ్యోతి): రావులపాలెం గ్రామదేవత ఆకులమ్మ అమ్మవారి జాతరను ఆదివారం నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా అమ్మవారి ఆలయం వద్ద చలువ పందిర్లు, విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. ఆదివారం రాత్రి జాతరను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.



దేశభద్రత కోసం పూజలు చేస్తున్న బీజేపీ నేతలు

సిందూర్ ఆపరేషన్ విజయం కోరుతూ పూజలు

కొత్తపేట, మే 10(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూర విజయవంతం కావాలని కోరుతూ శనివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం, సంపతి కనకేశ్వరరావు ఆధ్వర్యంలో బోడిపాలెం వంతెన వద్ద ఉన్న కనకదురమ్మ ఆలయంలలో పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఖండవల్లి పాండురంగాచార్యుల ఆధ్వర్యంలో పూజలు జరిపారు. కార్యక్రమంలో కోటపల్లి దామోదర్, రుద్రరాజు ప్రసాదరాజు, పి.మాధవస్వామి, భమిడిపాటి లక్ష్మీనారాయణ, గొలకోటి వెంకటేశ్వరరావు, ఇళ్ల పల్లంశెట్టి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

కమిటీల నియామకం త్వరితగతిన పూర్తిచేయాలి

మండపేట, మే 10(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వున్న పట్టణంతో పాటు గ్రామాల్లో టీడీపీ కమిటీల నియామకం త్వరితంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల టీడీపీ శ్రేణులను కోరారు. టీడీపీ పట్టణ కార్యాలయంలో ఆయన కమిటీల నియామకంపై పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యంగా కమిటీల నియామకం జరగటంతోపాటు కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించే బాధ్యత కమిటీలపై ఉంటుందని ఆయన అన్నారు. మండల కమిటీ గ్రామ స్థాయిలో అనుబంధ కమిటీల నియామకంపై ఆయన టీడీపీనేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి వారికి దిశానిర్దేశం చేశారు. పార్టీ కమిటీలను వేసి త్వరలో పూర్తి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండపేట మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, రాష్ట్ర టీఎన్‌టీయూసీ అధికార ప్రతినిధి వాదా ప్రసాదరావు, మాదిగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మండపల్లి చంద్రశేఖర్, ఎండీ ఖరీం, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తొలుత యుద్ధంలో అశువులు బాసిన సైనికుడు మృతికి ఎమ్మెల్యే వేగుళ్ల, పార్టీనేతలు సంతాపం తెలిపారు.

టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా ఉంగరాల మళ్లీ ఎన్నిక

మండపేట, మే 10(ఆంధ్రజ్యోతి): టీడీపీ పట్టణ అధ్యక్షుడుగా ప్రస్తుత అధ్యక్షుడు ఉంగరాల రాంబాబును మూడోసారి నియమించారు. శనివారం ఆయన స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును పార్టీ కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టతకు పనిచేస్తానని ఆయన అన్నారు. నూతన అధ్యక్షుడు రాంబాబును పలువురు టీడీపీ నేతలు అభినందించారు.

భారత్ సైనికుల విజయం కోరుతూ పూజలు

మండపేట, మే 10(ఆంధ్రజ్యోతి): భారత్-పాక్ యుద్ధం నేపథ్యంలో భారత్ సైనికులు విజయం సాధించాలని కోరుతూ మండపేట కరాచీ సెంటరులో వున్న వందేళ్ల చరిత్ర కలిగిన అంజనేయస్వామి ఆలయంలో పలువురు పూజలు, అభిషేకాలు చేశారు. అర్చకస్వామి పవన్ సారధ్యంలో శనివారం ఆలయంలో పూజలు జరిపారు.

మూసుకుపోయిన డ్రైన్‌కు మోక్షం



పెనికేరు వద్ద మూసుకుపోయిన డ్రైన్‌లో పూడికను తొలగిస్తున్న దృశ్యం

ఆలమూరు, మే 10(ఆంధ్రజ్యోతి): దాదాపు రెండు దశబ్దాలుగా తవ్వకాలు లేక మూసుకుపోయిన మురుగునీటి కాలువకు ఎట్టకేలకు మోక్షం లభించింది. మండలంలోని పెనికేరు, కలవచర్ల, ఆలమూరు గ్రామాల పంట భూముల్లో అదనంగా ఉన్న మురుగునీరు పోయే మార్గం లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావుకు రైతులు వివరించడంతో శనివారం ఎక్స్‌కవేటర్‌తో మూసుకుపోయిన పంట కాలువను బాగు చేయించే పనిని ప్రారంభించారు. ఈ మురుగుకాలువ వల్ల మూడు గ్రామాలకు చెందిన 300 ఎకరాలకు మోక్షం లభించనున్నది. పంట భూములకు సాగునీటి కాలువలు ఎంత అవసరమో పంట భూముల్లో అదనంగా ఉన్న నీరు వెళ్ల మురుగునీటి కాలువలు అంతే అవసరమని గుర్తించి తక్షణం రైతుల సమక్షంలో కాలువ తవ్వకాలు ప్రారంభించినట్టు నీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్ అన్నారు. సాగునీటి కాలువలతో పాటు మురుగునీటి కాలువల తవ్వకాలకు నిధులు మంజూరు చేస్తే రైతులకు మంచి ప్రయోజనం కలుగుతుందని ఆయన అన్నారు.



నార్కెడిమిల్లిలో ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్

నార్కెడిమిల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆత్రేయపురం, మే 10(ఆంధ్రజ్యోతి): నార్కెడిమిల్లిలో ప్రజలు విద్యుత్ సమస్యలతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీధిలైట్లు వెలగకపోవడం, ట్రాన్స్‌పార్మర్ మొరాయింపు వంటి పలు సమస్యలతో వారు పలు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం నార్కెడిమిల్లిలో మొరాయించిన విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై ఆర్డీవో శ్రీకర్‌తో పాటు ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు స్పందించారు. తక్షణమే గ్రామంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు ట్రాన్స్‌పార్మర్‌ను ఏర్పాటు చేయాలని ఏఈ అశోక్‌ను వారు ఆదేశించారు. వెంటనే ట్రాన్స్‌పార్మర్‌ను ఏర్పాటు చేసి కరెంట్ సమస్యలను పరిష్కరించారు.

నేడు చింతాలమ్మ జాతర

రాయవరం, మే 10(ఆంధ్రజ్యోతి): పసలపూడి గ్రామస్తుల ఇలవేల్పు పెద్ద చింతాలమ్మ, చిన్న చింతాలమ్మ, పోతురాజుస్వామి జాతరను 11న నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. వైశాఖమాసంలో వచ్చే పౌర్ణమి ముందు రోజున అమ్మవారి జాతర, 12న అమ్మవారి తీర్థం నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. అమ్మవారి ప్రతిరూపాలైన గరగలకు గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించనున్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వేణుగోపాలరెడ్డి ఆధ్వర్యంలో వీటి ఏర్పాట్లను పూర్తి చేశారు.




రాళ్లు, మొక్కలతో ఉన్న ర్యాలి హైస్కూల్ క్రీడా ప్రాంగణం(ఫైల్). పక్క చిత్రంలో పోటీలకు అనువుగా తీర్చిదిద్దిన క్రీడా ప్రాంగణం

ర్యాలి హైస్కూల్‌కు పూర్వపు వైభవం

• నాడు పిచ్చిమొక్కలతో క్రీడలకు పనికిరాని వైనం • నేడు జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు • బండారు సంజీవ్ సహకారంతో క్రీడలకు అనువుగా తీర్చిదిద్దిన ప్రాంగణం

ఆత్రేయపురం, మే 10(ఆంధ్రజ్యోతి): ర్యాలి రామకృష్ణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను 1936లో ఏర్పాటు చేశారు. ఈ హైస్కూల్‌కు నాలుగు గ్రామాల నుంచి విద్యార్థులు వచ్చేవారు. డ్రిల్ సమయంలో క్రీడాకారులకు నాలుగు ఎకరాల గ్రౌండ్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు వివిధ క్రీడల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడాకారులుగా పేరొందిన వారూ ఉన్నారు. గత 13 ఏళ్ల నుంచి హైస్కూల్ క్రీడా ప్రాంగణం చిట్టడివిని తలపిస్తోంది. అప్పటి నుంచి విద్యార్థు లకు అనువైన ఆటస్థలం లేక క్రీడలకు నోచుకోలేకపోయారు. నెల రోజుల క్రితం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనయుడు సంజీవ్ ర్యాలి గ్రామంలో పర్యటించిన సమయంలో స్థానిక యువత క్రీడా ప్రాంగణం సమస్యను తెలిపారు. వెంటనే దాన్ని పరిశీలించి మరమ్మతులు చేపట్టేందుకు తన సొంత ఖర్చుతో క్రీడా ప్రాంగణాన్ని ఆయన తీర్చిదిద్దారు. అడిగిన వెంటనే స్పందించిన సంజీవ్‌ను పలువురు యువకులు ఇటీవల సత్కరించారు. నాడు అధ్వానంగా ఉన్న క్రీడా ప్రాంగణంలో నేడు జిల్లాస్థాయిలో క్రికెట్ టోర్నమెంట్ పోటీ లు నిర్వహిస్తున్నారు. జిల్లా నలుమూలల నుంచి 60 బృందాలు ఈ ప్రాంగణంలో ఆడనున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు ఆయన్ను అభినందించారు.




ఆలమూరు మండలం యానాదులపేట అంగన్‌వాడీ కేంద్రంలో మాతృమూర్తులకు పాదపూజ చేస్తున్న చిన్నారులు. పక్క చిత్రంలో రాయవరం మండలం వి.సావరంలో మాతృ దినోత్సవం దృశ్యం

మాతృమూర్తుల రుణం తీర్చుకోలేనిది

ఆలమూరు, మే 10(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ అధ్వర్యంలో నిర్వహించిన తల్లికి పాదపూజ కార్యక్రమాన్ని ఆలమూరులో శనివారం ఘనంగా నిర్వహించారు. మదర్స్ డేను పురస్కరించుకుని దీన్ని నిర్వహించినట్లు ఐసీడీఎస్ సీడీపీవో గజలక్ష్మి తెలిపారు. ఆలమూరు యానాదుల కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో జరిపిన తల్లులకు పాదపూజ ఆకట్టుకుంది. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సీహెచ్ సరోజారాణి, జి.లక్ష్మీకుమారి, జి.సూర్యకుమారి, వి.ఆనందకుమారి, ఎం.రాజలక్ష్మి, డీ.మణి, బీ.వరలక్ష్మి, డి.శ్యామల తదితరులు పాల్గొన్నారు. మదర్స్ డేను పురస్కరించుకుని సీనియర్ హెల్పర్ గంధం రత్నంను అంగన్‌వాడీ కేంద్రంలో సత్కరించారు.

రాయవరం, (ఆంధ్రజ్యోతి): మాతృమూర్తుల రుణం తీర్చుకోలేనిదని వి.సావరం సర్పంచ్ కాకి కృష్ణవేణి అన్నారు. శనివారం వి.సావరంలో ఐసీడీఎస్ పీవో ఎ.గజలక్ష్మి ఆదేశాలపై సూపర్‌వైజర్ పి.సునీత ఆధ్వర్యంలో మాతృ దినోత్సవాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల వద్ద జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ తల్లికి మించిన దైవం లేదన్నారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రుల రుణాన్ని పిల్లలు తీర్చుకోవాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులతో వారి తల్లులకు పాదపూజ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి, కిషోరి బాలికలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

రావులపాలెం, మే 10(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులకు తలెత్తడంతో వెంటనే ప్రభుత్వం స్పందించిందన్నారు. ఇందులో భాగంగా ఇటీవల జిల్లాకు కొనుగోళ్ల టార్గెట్‌ను కూడా పెంచారన్నారు. వైసీపీ నాయకులు కూటవి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ధాన్యం కొనుగోళ్లపై రాద్ధాంతం చేస్తూ ఉనికి చాటుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు బండారు సందీప్, జక్కంపూడి వెంకటస్వామి, గుత్తుల పట్టాభిరామారావు, యర్రంశెట్టి నాగేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరమరణం పొందిన సైనికుడికి సంతాపం

కపిలేశ్వరపురం, మే 10 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సింధూర్‌లో వీరమరణం పొందిన మురళీనాయక్‌కు శనివారం సంతాపం తెలిపారు. స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ భారత్-పాక్ యుద్ధంలో జమ్మూకశ్మీర్‌లో అనంతపురానికి చెందిన సైనికుడు మురళీనాయక్ మృతి చెందడం బాధాకరమన్నారు. ఏపీఎన్జీజీ సంఘం మండపేట అధ్యక్షుడు జుత్తుగ మల్లిఖార్జునుడు ఆధ్వర్యంలో వీరమరణం పొందిన సైనికుడికి నివాళులర్పించి అతని ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. భారత సైనిక దళాలకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్, మేకా అచ్యుత రామయ్య, దొమ్మేటి వీర్రాజు, చింతా పెదకాపు, జుత్తుగ శ్యాంప్రసాద్, కట్టా మురళి, నేతల అన్నవరం, మల్లిపూడి శివకుమార్, పితాని రామచంద్రరావు తదితరులతో పాటు అధిక సంఖ్యలో యువత పాల్గొన్నారు.

భూముల కౌలు హక్కుల వేలం ప్రకటన

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, రామచంద్రపురం మండలంలో ఈ దిగువ పేర్కొన్న గ్రామాల్లో ఆలయాలకు చెందిన సాగుభూములు 3సం.లు కాలపరిమితికి అనగా 2025-2026 నుండి 2027-2028 వరకు కౌలుకు అమరికం చేయుటకు దేవదాయ శాఖ తనిఖీదారు సమక్షంలో బహిరంగ వేలం పాట జరుపబడును. ఆసక్తిగల వారు పాల్గొనవచ్చును.

వ. పేరు	దేవాలయం పేరు గ్రామం	భూమి ఉన్న గ్రామం	సర్వేనెం	విస్తీర్ణం	ప్లాటు	ధరావత్తు	సాల్వెన్సీ	వేలం పాట జరుగు ప్రదేశం, తేదీ, సమయం
1	శ్రీ సోమేశ్వరస్వామి	వెల్ల	5	3-56	1వ ప్లాటు	10000	3,00,000	శ్రీ సోమేశ్వర&శ్రీవేణు
	& శ్రీవేణుగోపాలస్వామి	వెల్ల	4, 6/1	2-10	2వ ప్లాటు	10000	3,00,000	గోపాలస్వామి ఆలయం
	వెల్ల, రామచంద్రపురం	వెల్ల	8, 61/1	3-83	3వ ప్లాటు	10000	3,00,000	వెల్ల,
	మండలం	వెల్ల	10	3-00	4వ ప్లాటు	10000	3,00,000	22-05-2025
		వెల్ల	10, 6/1	3-31	5వ ప్లాటు	10000	3,00,000	ఉదయం10గం.లకు
		వెల్ల	2, 6/1	3-06	6వ ప్లాటు	10000	3,00,000	
		వెల్ల	3	4-08	7వ ప్లాటు	10000	3,00,000	
		వెల్ల	9	3-50	8వ ప్లాటు	10000	3,00,000	
		వెల్ల	9, 6/1	3-65	9వ ప్లాటు	10000	3,00,000	
		వెల్ల	12,11,61	3-26	10వప్లాటు	10000	3,00,000	
		వెల్ల	2,4,6/1	5-26	11వప్లాటు	10000	3,00,000	
		వెల్ల	7/1,6/1,6/2	3-66	12వప్లాటు	10000	3,00,000	
		వెల్ల	11	3-88	13వప్లాటు	10000	3,00,000	
		వెల్ల	183/3,184	1-41	14వప్లాటు	10000	3,00,000	
2	శ్రీసీతారామస్వామి	భీమక్రోసుపాలెం	14/2	1-05		5000	2,00,000	శ్రీ సీతారామస్వామి వారి
	వారి దేవస్థానం		25/7	0-58				ఆలయం, భీమక్రోసుపాలెం
	భీమక్రోసుపాలెం		184/2	0-37				23-05-2025
	రామచంద్రపురం			2-00				ఉదయం12గం.లకు
	మండలం	భీమక్రోసుపాలెం	208/5	0-23		5000	2,00,00	
			209/4	0-19				
			205/3	0-65				
			209/2	1-32				
				2-39				
		భీమక్రోసుపాలెం	67/7	0-60		5000	2,00,000	
		భీమక్రోసుపాలెం	171/2	1-09		5000	2,00,000	
		భీమక్రోసుపాలెం	268/1	3-02		5000	2,00,000	
			281/2	0-50		5000	2,00,000	
				2-52				
		భీమక్రోసుపాలెం	40 కొబ్బరి చెట్లు			5000	2,00,000	
3	శ్రీ భీమేశ్వరస్వామి	భీమక్రోసుపాలెం	100/1	2-50	1వ ప్లాటు	10000	3,00,000	శ్రీసీతారామస్వామి వారి
	వారి దేవాస్థానం	భీమక్రోసుపాలెం	100/1	1-38	2వ ప్లాటు	10000	3,00,000	ఆలయం
	భీమక్రోసుపాలెం		97/1	1-02				భీమక్రోసుపాలెం
	రామచంద్రపురం			2-40				23-05-2025
	మండలం	భీమక్రోసుపాలెం	2/3	0-77	3వ ప్లాటు	5000	2,00,000	ఉదయం10 గం.లకు
4	శ్రీ వరుణేశ్వరస్వామి	జగన్నాయకులపాలెం	256/1	2-02	1వ ప్లాటు	10000	3,00,000	శ్రీరామాలయం వారి
	వారి దేవస్థానం	జగన్నాయకులపాలెం	263	0-75	2వ ప్లాటు	5000	2,00,000	ఆలయం వద్ద
	జగన్నాయకులపాలెం	జగన్నాయకులపాలెం	256/1	0-70	3వ ప్లాటు	5000	2,00,000	తొగరువారి సావరం
	రామచంద్రపురం	జగన్నాయకులపాలెం	263	0-85	4వ ప్లాటు	5000	2,00,000	23-05-2025
	మండలం							మధ్యాహ్నం 03 గం.లకు

ప్రథమ ధరావత్తు చెల్లించి, సాల్వెన్సీ సర్టిఫికెట్ సమర్పించి పాటలో పాల్గొనవలెను. పాటదారుడు పాట అయిన వెంటనే ఒక సంవత్సరం శిస్తు అడ్వాన్సుగా చెల్లించవలెను. మిగిలిన వివరాలకు కార్యాలయం పనివేళలో తెలుసుకొనవచ్చును.

ది.10.05.2025 కార్యనిర్వహణాధికారి